# అవధాన పుష్కరిణి

అంతర్జాల మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 6 ఫాల్గుణ శుద్ధ విదియ, 19 ఫిబ్రవరి 2026

## శతావధానులు వేంకట రామకృష్ణ కవులు



ఓలేటి వేంకటరామశాస్త్రి, (1883-1939) వేదుల రామకృష్ణశాస్త్రి (1889 -1918)

ఉ॥ కొండలురేగి లోకముల గుండలు సేయుచునుండ జూచి యా
ఖండలు డుద్ధతుండయి యఖండపరాక్రమ మొప్ప రెక్కలన్
జెండ గడంగుటం దెలిసి శీతనగాత్మజు డబ్ధి వజ్రి రా
కుండను గొండ సొచ్చె నిదిగో! యని పల్కెను విస్మయంబునన్

ప్రచురణ

అవధాన విద్యా వికాస పరిషత్

భాగ్యనగరం

అవధాన విద్యా విజయతే తరామ్



డా. బులుసు అపర్ణ గారి అవధానం



డా. రాంభట్ల పార్వతీశ్వర శర్మ గారి అవధానం



డా. తాతా సందీప్ శర్మ గారి అవధానం



గట్టెడి విశ్వంత్ గారి అవధానం

2026 జనవరి 29,30 తేదీలలో అనంతపురంలోని

శృంగేరి శంకరమఠం 29వ వార్షికోత్సవాలలో

భాగంగా జరిగిన

**'జగద్గురువుల వజ్రోత్సవ భారతి అవధాన సప్తకం'**

చిత్రమాలిక

# అవధాన పుష్కరిణి

సంపుటి - 1 | అంతర్జాల మాస పత్రిక | సంచిక - 6

విశ్వావసు - ఫాల్గుణం 2026 | 19-02-2026 | ప్రచురణ: అవధాన విద్యా వికాస పరిషత్


శ్రీయుతమై రసైకలహరీసితమై, వివిధావధాన వి
ద్యాయతధీకవీశ్వరులు తామరలై విరియన్ - తదీయ వి
జ్ఞేయ సుపద్యమాధురు లశేషబుధాళుల కిందు విందుగా
నీ యవధాన పుష్కరిణి - ఈప్సితమై వెలుగొందు నందమై

– డా. జి.యం.రామశర్మ, శతావధాని


## సంపాదక వర్గం

**ప్రధాన సంపాదకులు**
మరుమాముల దత్తాత్రేయశర్మ

**సహసంపాదకులు**
కె.వి.ఎన్. ఆచార్య

**గౌరవ సలహాదారులు**
నారుమంచి వేంకట అనంతకృష్ణ శర్మ
మరుమాముల వేంకటరమణశర్మ
కంది శంకరయ్య

**సంపాదకవర్గం**
డా॥ జి.యం.రామశర్మ
ఆముదాల మురళి
డా॥ సంగనభట్ల నరసయ్య
మారేపల్లి వేంకట పట్వర్ధన్
ఆచార్య ఫణీంద్ర
చిటితోటి విజయకుమార్
చింతా రామకృష్ణారావు

**రూపకల్పన:** పంతుల విట్టుబాబు
**అక్షరాలంకరణ:** విరివెంటి సాహితీసుధ



**కార్యాలయం**
శ్రీరామ సదనం, 29-1499/6/1,
వెస్ట్ కాకతీయ నగర్, రోడ్ నం. 1,
నేరేడుమెట్టు, సికిందరాబాద్ – 500 056
ఫోన్: 9441039146



అవధాన విద్యా వికాస పరిషత్ సేవాకార్యక్రమాలకు ఆర్థికంగా సహకరించదలచిన సహృదయులు ఫోన్ పే ద్వారా స్పందించగలరు.


**అవధానవిద్యా విజయతే తరామ్** **సంపాదకీయం**

## సావధాన

ఏకాగ్రత అనే ఒంటిస్తంభంపై నిలిచే అందాల భవనం అవధానం. ఏ మాత్రం కుదురు తప్పినా ధారణ చెదిరిపోతుంది. ఏకాగ్రత నిలుపుకోవడం అవధాని పనైతే అవధాని విజయం సాధించేలా చూసుకోవడం నిర్వాహకుల పని.

పూర్వకాలం అవధానాలు అరుదుగా జరిగినా కుదురుగా జరిగేవి. అవధాని ఆశుధారా ధారణాపరీక్షలు నిశితంగా జరిగేవి. సుష్ఠుగా శబ్ద చర్చలు, శాస్త్రపరీక్షలు జరిగేవి. ప్రష్టలు కూడా పండితులై ఉండి అవధాని ప్రతిభను బహుముఖీనంగా పరీక్షించి నిగ్గు దేల్చిన సన్నివేశాలు కోకొల్లలు. ఒక్క అష్టావధానమే మూడు నాలుగు గంటల పాటు సాగిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

ఇక ఈతరం అవధానాలు విషయానికి వచ్చేసరికి – అవధానాలు విపరీతంగా పెరిగాయి. చేసేవారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. ఆన్లైన్ అవధానాలు లెక్కకు మిక్కిలిగా జరుగుతున్నాయి.

ఒకరకంగా చెప్పాలంటే కవి సమ్మేళనాల కంటే అవధానానికే ఇవాళ డిమాండ్ ఎక్కువైంది. నిర్వాహకులు కూడా అవధానాన్ని వీలున్నంత ఘనంగా నిర్వహిస్తున్నారు. శాలువాలు, జ్ఞాపికలు, పూలగుత్తులు, నగదు కవర్లు, అతిథుల, ఆహూతుల ఆగమనాలు, ఆర్భాటాలు… ఒక్కటేమిటి ఉత్సవంలాగా అవధాన సభలు అన్ని హంగులతో జరుగుతున్నాయి. రాజకీయ నాయకులు, సాహిత్యేతర రంగాలకు చెందిన వదాన్యులతో ఒక అష్టావధాన సభకు కనీసం ఒక అధ్యక్షుడు, ముఖ్యాతిథి (వీలుంటే ఆత్మీయాతిథులు) తోబాటు సంచాలకుడు ఉంటున్నారు. అవధానిని సభకు ముందే రప్పించి కూర్చుండ బెడతారు. అతిథుల, ఆహ్వానితుల సందేశాలు, అధ్యక్షుల అభిభాషణం… ఆ తర్వాత సంచాలకుల చేతికి మైక్ వస్తుంది. విధి బలీయంగా అవధాని ఈ ప్రసంగాలన్నీ వింటూ సావధానచిత్తుడై ఉండాలి. ఈలోగా ముఖ్యాతిథి త్వరగా వెళ్ళవలసి ఉంటే సత్కారాల పర్వం కొనసాగుతుంది.ప్రతి సభలో సంచాలకులు అవధానం అంటే ఏమిటి దగ్గర్నుంచి అంశాల వివరణ, ప్రష్టల ప్రశంస చేసి …. అప్పుడెప్పటికో అవధానికి మైక్ అందిస్తారు. ఇదంతాజరిగి మొదటి ఆవృత్తి పూర్తయ్యే సరికి గంట దాటుతుంది. ప్రష్టలు సూటిగా ప్రశ్నలు సంధించకపోయినా , స్వీయ పద్యాలతో హోరెత్తించినా అప్రస్తుతం వారు విజృంభించినా మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉండనే ఉంటుంది. ఎలాగోలా రెండవ ఆవృత్తి పూర్తి కాగానే సర్వ సాధారణంగా జరిగేపని ధారణాంశాల మూడు నాలుగు పాదాలు ఒకేసారి చెప్పమని


(మిగతా 2వ పేజీలో)

# సంస్తుతి



## వాణీస్తుతి

పద్మనాభవృత్తము

అష్టావధానక్రియాదోహలంబైన యస్మన్మనః పుండరీకంబునన్ వి
స్పష్టామరాహార నీహార కర్పూరపాటీరశోభన్ విరాజిల్లు భావ
త్కాష్టాపదోదారమున్ నిల్పికొన్నాఁడ నాకారమున్ దేవతామౌళిరత్నా
శ్లిష్టాంఘ్రి! యో వాణి! భూషీకృతార్ధేందులేఖా! నమస్తే నమస్తే నమస్తే.

– డా॥ సి.వి.సుబ్బన్న శతావధాని

## సహృద్వాణి

అవధానపుష్కరిణి ఆసక్తి కలిగించే విభిన్నవ్యాసాలతో ఆకర్షణీయంగా ఉంది.

– డా॥ నరాల రామారెడ్డి

సమగ్ర విషయ సమన్వితంగా పత్రికను రూపొందించారు.

– గన్నమరాజు గిరిజామనోహర్ బాబు

పుష్కరాణాం సమూహః తత్సన్నికృష్ట దేశో వా కమల సమూహము; అది దగ్గర గల ప్రదేశమును పుష్కరిణీ అంటారు. వాడిపోని ఎన్నో అవధాన కమలాలను ఒక దగ్గరగా చేరుస్తూ, అవధాన కమలాలతో ప్రతి సంచికని అందంగా తీర్చిదిద్దుతున్నారు.

– ఆచార్య తాడేపల్లి పతంజలి.

అవధాన పుష్కరిణి పత్రిక ఆసాంతం ప్రతీ సాహిత్యాభిలాషినీ అలరించే పత్రిక. అవధానులుగా తయారు కావాలనుకున్న వారికి చైతన్య దీపిక. ఇందులో అవధాని ఒక నెలలో చదువుకో దగ్గ ఎన్నో అంశాలు పొందుపరచడం విశేషం. నేనైతే ఈ పత్రికను ముద్రణ చేయించి చదువుతున్నాను. ఏదేమైనా ఎలా చదివినా ప్రతీ అంశం ఒక పాఠం. ప్రతీ పద్యం నేర్చుకోదగినది. ఈ కృషి చేస్తున్న సంపాదకులకు సర్వదా శతధా సహస్రధా నమోవాకములు. ఇది మాటల చేత చెప్పేది కాదు. నెల వచ్చేసరికి అన్నిటినీ సేకరించి వేయడం ఈ–తరంలో సాధ్యమా అంటే వివిధ వృత్తులలో ఉన్నవారి ప్రవృత్తిని గుర్తు చేస్తూ పాఠకులకు అందించే ప్రక్రియ కష్టతరం. కానీ, ఇది సాధ్యం చేస్తున్న సంపాదకులకు శుభాకాంక్షలు. అవధాన విద్యా విజయతే తరాం

– రంప సాయికుమార్ శర్మ, శ్రీకాకుళం.

## ఇదీ క్రమణిక


1. కావ్యాస్వాదన ... ... ... ... ... ... ... ... 3
2. అవధానకళాచరిత్ర ... ... ... ... ... ... . 4
3. సత్కకవి ప్రతిభకు తార్కాణం సమస్యాపూరణం.. 6
4. పద్యపరీమళం ... ... ... ... ... ... . 7,12
5. విశిష్ట తెలుగు భాషా వైభవం... ... ... ... .. 8
6. అవధానవేదిక ... ... ... ... ... ... ... ... 10
7. పూరణతోరణం ... ... ... ... ... ... . 13
8. ఛందస్సౌందర్యం ... ... ... ... ... ... ... 15
9. నిఘంటుపరిజ్ఞానం... ... ... ... ... ... ... 16
10. వ్యాకరణ వరివస్య ... ... ... ... ... ... .. 17
11. కావ్యశాస్త్రగవేషణ ... ... ... ... ... ... ... 18
12. ప్రహేళికా... ... ... ... ... ... ... ... ... . 20
13. బమ్మెర పోతన భాగవతం–అలంకారసౌందర్యం 21
14. ఖండశర్కర ... ... ... ... ... ... ... ... . 22
15. సంస్కృత సంస్కృతి ... ... ... ... ... ... 24


(1వ పేజీ తరువాయి) **సంపాదకీయం**

అవధానినికోరడం. ఆశువు, ఛందోభాషణ, వారగణనం వంటి ధారణేతరాంశాలు రెండు/మూడుఆవృత్తులకే పరిమితం చేయడం వెనువెంటనే ధారణ చేయమని అవధానిని నిర్దేశించడం జరుగుతుంది. ఇది అవధానిపై నిజంగా ఒత్తిడి పెంచడమే. నేటి అవధానాల్లో సజావుగా నాలుగు ఆవృత్తులు జరిగిన సందర్భాలు చాలా అరుదు. అన్నీ ఉన్నా అవధానానికి సమయం లేదంటారు.

ఇందుకు పరిష్కారంగా.. ఏ అతిథి కోసమో ఎదురు చూడకుండా సకాలంలో అవధానం ఆరంభించాలి. అవధానానికి ముందు ప్రసంగాలు చాలా సంక్షిప్త రమణీయంగా ఉండాలి.

ప్రష్టలు సూటిగా ప్రశ్నించాలి. కనీసం మూడు పాదాలవర్లకైనా నిషేధం కొనసాగాలి.

నాలుగు ఆవృత్తులలో అన్నిఅంశాలు ఖచ్చితంగా జరగాలి. సమయంతో పోటీ కాకుండా ఇచ్చిన అంశాల పూరణ, పూరణ లోని అందాలు సదస్యులకు తెలిసేలా ధారణ జరగాలి. అప్రస్తుతం కేవలం వినోదం కోసమే కాకుండా సాహిత్యపరంగా సరసంగా జరగాలి. అవధాని ప్రతిభకు ఒరిపిడి పెట్టే మేధారణం జరగితీరాలి.

సత్కారాలు అతిథి సందేశాలు విధిగా అవధానానంతరమే జరగాలి. ఇలాంటి అవధానమే జరిగితే చూడాలి.

# యయాతి చరిత్ర

## డా. ఆచార్య ఫణీంద్ర

విన్నేరు తలగల్గు వేల్పునౌ దలపువ్వు
తలప నెవ్వని తాత తాత తండ్రి –
కలువల చెలికాని గారంపు బట్టియై
తనరారు నే రేని తాత తాత –
దీవులు పదునెన్మిదింటితో నేలయం
తయు నేలె నే రేని తాత తండ్రి –
తనయాన సుడి గట్టు వెనుక బర్వగ జాల
దేజున మించె నే రాజు తాత –
చేరి జేజేలు మరి జడదారి గములు
నచ్చరలు గొల్వ వేగన్ను లతని మొదలి
రాచనెల వేలె బేర్మి నే రాజు తండ్రి –
యతడు కొనియాడ నెగడె యయాతి పుడమి!

ఇది "పొన్నికంటి తెలగన" కవిచే రచింపబడిన "యయాతి చరిత్ర"లో ప్రథమాశ్వాసంలోని 91వ పద్యం. ఈ పద్యానికి ముందు ఒక 15 పద్యాల మేరకు కవి 'ప్రతిష్ఠానపురం' వర్ణనను వివిధ రకాలుగా కొనసాగించి, కావ్యంలోని "పుర వర్ణన" అంశాన్ని ముగించాడు. ఇక ఈ పద్యంలో ఆ పురాధిపతి యైన యయాతి మహారాజును మనకు వివిధ విశేష వివరాలతో పరిచయం చేస్తున్నాడు కావ్యకర్త పొన్నికంటి తెలగన.

"విను" లేక "విన్ను" అంటే ఆకాశం. "విన్నేరు" అంటే ఆకాశంలోని నది. అనగా గంగ. దానిని తలపై గలిగిన వేల్పు – శివుడు. ఆ శివుని తలపువ్వు అనగా .. శివుని శిఖలో నిలిచిన చంద్రుడు.

ఆ చంద్రుడు ఎవని తాత యొక్క తాతకు తండ్రియో .. అని ఈ సీసపద్యంలోని మొదటి పాదానికి అర్థం. పురాణాల జ్ఞానం కొంత ఉంటే గాని .. ఏ రాజుకు ఈ రాజు (చంద్రుడు) తాత యొక్క తాతకు తండ్రి అవుతాడో మనకు అవగతం కాదు. పురాణాలు కాస్త ఓపికతో తిరగవేస్తే మనకు ఈ విషయాలు తెలుస్తాయి.

చంద్రుని కుమారుడు బుధుడు – వాని కుమారుడు పురూరవుడు – వాని కుమారుడు ఆయువు – వాని కుమారుడు నహుషుడు – వాని కుమారుడు యయాతి.

కావున – యయాతి మహారాజు తాత ఆయువు. వాని తాత బుధుడు. వాని తండ్రి చంద్రుడు. ఈ అచ్చ తెనుగు కావ్య కథానాయకుడు యయాతి యొక్క తాత తాత తండ్రి చంద్రుడన్న మాట!




ఇక రెండవ పాదాన్ని చూద్దాం. "కలువ చెలికాడు" అన్నా..చంద్రుడే కదా! అతని గారాల పట్టి బుధుడే! (నిజానికి బుధుడు తనను తారకు అక్రమ సంతానంగా కన్నందుకు చంద్రుణ్ణి ద్వేషిస్తూ ఉంటాడు. కానీ .. చంద్రునికి మాత్రం బుధుడు గారాల పట్టే అని కవి చెప్పడం కొంత చమత్కారమే!) ఆ బుధుడు ఏ రాజుకు తాత తాత అంటే .. మళ్ళీ సమాధానం – యయాతి మహారాజే! అంటే .. అటు తిప్పి, ఇటు తిప్పి .. రెండవ పాదంలో కూడ ... కాస్త చమత్కారాన్ని జోడించి కవి మళ్ళీ అదే విషయం మరో రకంగా చెప్పాడు.

ఇక .. మూడవ పాదంలో ఆ యయాతి ప్రభువు తాత అయిన ఆయువుకు తండ్రి అయిన పురూరవుడు 18 దీవులతో (అనగా .. అష్టాదశ ద్వీపాలతో) కూడిన సమస్త భూమండలాన్ని ఏలిన వాడు అని వివరిస్తాడు కవి. నాలుగవ పాదంలో ప్రయోగించిన "సుడికట్టు" అన్న అచ్చ తెనుగు పదానికి అర్థాన్ని వివరిస్తూ, కొందరు పండితులు – భూమండలం చుట్టూ ఉన్న "చక్రవాళ పర్వతం"గా గ్రహించవలెనని సూచించారు. ఇక ఈ పాదంలోని మరొక అచ్చ తెనుగు పదం – "తేజు" అనగా ప్రకాశం అని అర్థం. తన ఆనతి (పరిపాలన) భూమండల పరిధి దాటి ఆ చక్రవాళ పర్వతం వెనుక కూడ వ్యాపించగా, పాలిస్తూ ప్రకాశవంతంగా రాణించిన వాడైన ఆయువు మహారాజు యయాతి విభునికి తాత అని ప్రస్తావించాడు కవి ఈ పాదంలో.

ఇక .. ఎత్తు గీతిని పరిశీలిద్దాం. ఇక్కడ మనం తెలుసుకో వలసిన అచ్చ తెనుగు పదాలు – జడదారి (జటాధారి లేక ఋషి); గములు (గుంపులు లేక సమూహాలు); అచ్చరలు అంటే అప్సరసలని మనకు తెలుసు. పోతే .. వేగన్నులతడు (వేయి కన్నులు గల ఇంద్రుడు); మొదలి రాచనెలవు (మొదటి రాజధాని .. ఇంద్రుని అమరలోకానికి మొదటి రాజధాని – స్వర్గం). ఇప్పుడు కావ్యకర్త ఇక్కడ ఏం చెప్పాడో చూద్దాం. ఋషులు, అప్సరసలు సమూహాలుగా చేరి కొలువగా, ఇంద్రుని మొదటి రాజధాని అయిన స్వర్గాన్ని పాలించిన నహుషుడు (ఇది ఇంద్రుడు శాప వశాన రాజ్యార్హత కోల్పోయినప్పుడు .. అని మరొక పురాణ గాథలోని విషయం) ప్రతిష్ఠానపురాన్ని ఏలుతున్న యయాతి రాజేంద్రునికి తండ్రి. ఆ విధంగా కొనియాడబడుతూ వర్ధిల్లు తున్నాడు ఈ భూమిని పాలిస్తున్న యయాతి అని ఈ పద్యం యొక్క సంపూర్ణ భావం.

మొత్తానికి .. కవి "పొన్నికంటి తెలగన" తన కావ్య కథా నాయకుడైన యయాతి మహారాజు (మిగతా 6వ పేజీలో)

# తిరుపతి వేంకటకవులు

అవధానమన్నా, ఆశుకవిత్వమన్నా తిరుపతి వేంకటకవులే అనే ప్రఖ్యాతి ఏర్పడేటట్లు తెలుగుపద్యాన్ని ఊరేగించిన జంటకవులు ఈ తిరుపతి వేంకటకవులు. చెళ్ళపిళ్ల వేంకటశాస్త్రి గారున్న దివాకర్ల తిరుపతిశాస్త్రి గారున్ను కలిసి తిరుపతి వేంకటకవుల జంట. ఈ జంటను ఏర్పాటు చేసిన గురుబ్రహ్మ చర్ల బ్రహ్మయ్యశాస్త్రిగారు.

చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు 1870 ఆగస్టు నెల 8వ తేదీ తూర్పు గోదావరి జిల్లాలోని కడియం గ్రామంలో జన్మించారు. తల్లిపేరు చంద్రమ్మ, తండ్రిపేరు కామయ్య, దివాకర్ల తిరుపతి శాస్త్రిగారు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం తాలుకాలోని ఎండగండి గ్రామంలో 26 మార్చి 1872న జన్మించారు. తల్లిపేరు శేషమ్మ తండ్రి పేరు వేంకటావధాని.

తిరుపతి వేంకటకవులు షడ్దర్శనీవేదియైన చర్ల బ్రహ్మయ్య శాస్త్రిగారి వద్ద భాష్యాంత వ్యాకరణాన్ని చదువుకొన్నారు. మాడభూషివారి అవధాన పద్ధతిని అనుసరించి ప్రప్రథమంగా కాకినాడలో జంటగా అష్టావధానం చేశారు. అంతకు ముందు వేంకట శాస్త్రిగారొక్కరి నిడమర్రు లోను, గుండుగొలనులోన రెండు అష్టావధానాలు చేశారు. కాకినాడలో అష్టానధానం జరిగిన మరునాడు ప్రేక్షకుల కోరిక మేరకు 25 అక్టోబరు 1891న శతావధానం చేశారు.




అటుపిమ్మట అమలాపురం, ఏలూరు, బందరు, చెన్నపట్టణం, బెజవాడ, విజయనగరం, కొత్తపల్లె, గద్వాల, నర్సాపురం, మొగల్తూరు, పిఠాపురం, గుంటూరు, ఆలమూరు, శ్రీకాకుళం, ఉర్లాం, నూజివీడు, వేమవరాగ్రహారం, లక్ష్మీ నర్సాపురం మొదలగు పట్టణాల్లో సుమారు 29 శతావధానాలు చేశారు.

నానారాజ సందర్శనంలో పేర్కొన్న ప్రకారం వీరు అనేక సంస్థానాలను సందర్శించారు. ఆ విషయాన్ని వారు **"అటు గద్వాలిటు చెన్నపట్టణము మధ్యంగల్గు దేశంబునన్ జటులస్ఫూర్తి శతావధానమును మెచ్చన్ జేసియున్నట్టి మాకిట రాజీయకయున్న దర్శనము నింకెవ్వానికి రాజొసంగుట"** అంటూ పేర్కొన్నారు. అందరి రాజుల దర్శనాన్ని సంపాదించారు. అన్నిచోట్ల అవధానాలు, ఆశుకవితా ప్రదర్శనలు చేశారు. వీరి అసాధారణ ధారాధారణాయుతమైన కవిత్వ శక్తికి అబ్బురపడిన ఆత్మకూరు సీతారామభూపాలుడు గజారోహణోత్సవం గావించాడు. గద్వాల భూపతి జయపత్రం ప్రసాదించారు. కాకినాడలో 'కింకవీంద్ర ఘటాపంచానన', అమలాపురంలో 'విద్వత్కవి', బందరులో 'బాలకళానిధి', నెల్లూరులో 'బాలసరస్వతి' బిరుదులు పొందారు.

తిరుపతి శాస్త్రిగారు 1901 నుండి 1918 వరకు పోలవరం జమీందారు ఆస్థానకవియై, పిమ్మట కోలంక-వీరవాసరం జమీందారిణి వద్ద ఆస్థానకవిగా నుండి 1920లో దివంగతులైనారు. వేంకటశాస్త్రిగారు 1903 నుండి 1916 వరకు బందరు హిందూ హైస్కూలులో తెలుగు పండితులుగా పనిచేశారు. 1949లో మద్రాసు ప్రభుత్వం వారిని ఆస్థానకవిగా నియమించింది. వారు 1950 ఫిబ్రవరి 10న శివరాత్రి నాడు పరమపదించారు.

తిరుపతి వేంకటకవులు నానారాజసందర్శనం చేస్తూ కూడా ఉత్తమకావ్య రచన చేసిన సమర్థులు. అవధానాలలో "ఒక చరణం బతండు మఱి యొక్కటి నేను మఱొక్క టాతడున్" అని నియమం పెట్టుకొన్న వీరు కావ్యరచనలో కూడా 'ఒక్కరు రచియించి రేనియును కాదగు తిర్పతి వేంకటీయమై' అనే నియమంతో అసంఖ్యాకరచనలు చేశారు. సంస్కృతంలోను, తెలుగులోను సమాన ప్రజ్ఞతో వీరు కవిత్వమల్లిరి.

వీరు పాండవజననం, పాండవోద్యోగం, పాండవాశ్వమేధం, పాండవ రాజసూయం, పాండవవిజయం, పాండవప్రవాసం, ముద్రారాక్షసం, మృచ్ఛకటికం, ప్రభావతీ ప్రద్యుమ్నం, బాలరామాయణం, అనే నాటకాలు; బుద్ధచరితం, లక్షణాపరిణయం, ఏలా మాహాత్మ్యం, నానారాజ సందర్శనం, శ్రవణానందం అనే పద్యకృతులు; విక్రమాంకదేవచరిత్రం, చంద్రప్రభాచరిత్రం, హర్షచరిత్రం అనే వచనగ్రంథాలు; గుంటూరిసీమ, గీరతము, శృంఖలా తృణీకరణం, పశ్యాంపుశ్యాం, పశ్యశబ్దవిచారం, శనిగ్రహం అనే విమర్శగ్రంథాలు; శతావధానసారం, గుంటూరు శతావధానం, పినపాడు శతావధానం, వేమవరాగ్రహార శతావధానం అనే శతావధానకృతులు; కథలు-గాథలు, కలగూరగంప, జాతకచర్య మొదలగు రచనలు చేశారు. దివాకర్ల తిరుపతి శాస్త్రి మరణించిన పిమ్మట వేంకటశాస్త్రి 'దివాకరాస్తమయం' వ్రాశారు. అవధానులై ఉండి ఇన్ని ప్రక్రియల్లో ఇన్ని విస్తృత రచనలు చేసినవారు వీరు మాత్రమే.

అవధానం ఆశుకవితాభూయిష్ఠమగుటచే అందు అర్థగాంభీర్యం, రసస్ఫూర్తి పదప్రయోగ ఔచిత్యం ఉండవనే వాదన ఉన్నది. అందుకు వారు వారి ఆశువులను గూర్చి ఇలా అన్నారు.

'ఇతరకవుల్ ప్రయాసపడి యెంచి రచించిన నూటికెన్ని పె
ద్దతనము గాంచి చిత్తమును దన్పునొ, మేమవధాన సంగత
స్థితిగని యాశుగా రచన చేసిన పద్యములందు జూచినన్
శతమున కన్ని పద్యములు చక్కగ నుండు నసంశయమ్ముగన్'

ఇది వారి అవధాన కవితాలక్షణమే కాక ఇతరులకు వీరికిగల భేదమును గూడా తెలియజేసే పద్యం. అవధానాల్లో వారు చెప్పిన కొన్ని పద్యాలను పరిశీలిద్దాం.

**సమస్యాపూరణలు**

శ్రీ తిరుపతి వేంకటకవులు అన్వయరహితాలు, దుష్కర ప్రాసయుక్తములు, అనన్య సాధ్యములైన సమస్య లెన్నింటినో సరసంగా పూరించారు. మచ్చుకుకొన్ని.

నెల్లూరు సభలో ఇచ్చిన

**"సంధ్యావందన మాచరింపవలదా చౌశీతి బంధమ్ములన్"**

అనే సమస్యలను ఇలా పూరించారు.

"వింధ్యాద్రి ప్రభ నొప్పు బల్ కుచములన్ వేపట్టి పెంపొందు కా
మాంధ్యం బార్పగ లేక వెత్రివలె నేలా మంచి యా రాతిరిన్
వంధ్యం జేసెదు, కాముకేళియనగా పాండిత్యమా? లేక నీ
సంధ్యా వందనమా? చరింపవలదా చౌశీతి బంధమ్ములన్!"

– సమస్యలో వీరు చేసిన విరుపువల్ల చక్కని అన్వయం కుదరడమే కాకుండా గంభీరభావం కూడా నెలకొన్నది. ఇందులో చిక్కంతా ప్రాసే. కాని అదివారి ఆశుధారనుగాని, కవిత్వధారను గాని అడ్డుకోలేకపోయింది.

కాకినాడ శతావధానంలో **"బకమున్ వడి మ్రింగుచున్న బల్లిం గనుమా"** అని సమస్య నిచ్చారు. బల్లి కొంగను మ్రింగుట అసాధ్యం. తిరుపతి కవుల అవధానంలో బకము ఎలా మారిందో చూడండి.

"ప్రకటతర కప్పగంతుల
సుకులోదధి పూర్ణచంద్ర! సూరిజనేంద్రా!
సుకరముగ మక్షికాశా
బకమున్ వడి మ్రింగుచున్న బల్లిం గనుమా"

బకము సుకరంగా మక్షికాశాబకముగా మారిపోయింది. ఈగను బల్లి తినడంలో సమస్య లేదుగదా! విశాఖపట్టణంలో చేసిన అవధానంలో **'పాదమ్ములు లేని తరులు పరుగిడజొచ్చెన్'** అని ఇచ్చిన సమస్యను స్వీకరించిన తిరుపతి వేంకటకవులు చెట్లనెలా పరుగెత్తించారో చూడండి.

"ఏడెస వానలు గురియన్
గోదావరి పొంగివచ్చె గుములుగ నందున్
వేదొరలి నీట దృఢతర
పాదమ్ములు లేని తరులు పరుగిడ జొచ్చెన్"

అదే అవధానంలో ఇద్దరు స్త్రీలకు సంతానం కలిగే సమస్యను పరిష్కరించిన తీరుచూడండి.

"అతికుతుకం బలరారగ
జతురత మెఱయంగ మదన శాస్త్ర విధమునన్
వితతంబగు తన సౌధవ
సతి సతి గలియంగ బుత్ర సంతతి గలిగెన్"

వీరు సమస్యలను అర్థాంతరన్యాస అలంకారంగా మార్చి పూరించినవి చాలా ఉన్నాయి. మచ్చుకొక సమస్య బెజవాడ శతావధానం నుండి చూడండి.

"మందారము జూడనెంతురె ఘనంబగు నట్టి గులాబి ముందరన్" – ముందు ఒక గురువు అదనంగా ఉన్న ఉత్పలమాలా వృత్తమిది. మొదటదాన్ని గ్రహించి రేఫప్రాసతో ఉత్పలమాల ప్రారంభించాలి. ఇదే ఇందులో ప్రధానమైన సమస్య. దాన్ని ఆలంకారింకంగా పూరించిన పద్యం ఇది.

ధీరత గల్గి చక్కనగు తెల్వియు దేటయు బొల్చి మేల్మి బం
గారము రీతిగా గవిత కల్పన చేసెడి వారలుండ శు
ష్కోరు తరోక్తులన్ గొనగ నొప్పుదురే సుకవీంద్రులెందు మం
దారము జూడనెంతురె ఘనంబగు నట్టిగులాబి ముందరన్.

తిరుపతి కవులు సంస్కృత సమస్యలను కూడా పూరించారు. బందరు శతావధానంలో **'మధ్యాహ్నే శశి మండలం కబళితం క్రూరాత్మనా రాహుణా'** అని సమస్య నిచ్చారు. ఈ సమస్యను అభిమన్యుయుద్ధ కథకు అనుసంధానం చేసిన తీరు చూడండి.

పద్మవ్యూహముపాగతే గురువరే తస్మిన్ప్రవిష్టం రయా
చ్ఛూరం పార్థసుతం జఘాన గదయా దౌశ్శాసనిః క్రూరయా ।
దృష్ట్వా తద్వదనం గదావికలితం ప్రోచుర్మిథో నిర్జరా
మధ్యాహ్నే శశిమండలం కబళితం క్రూరాత్మనా రాహుణా ॥

(సశేషం)

**మనవి**

- పత్రికకు వ్యాసాలు, పద్యపూరణలు పంపేవారు యూనికోడ్ లో ఓపెన్ టెక్స్ట్ ఫైల్ రూపంలో మాత్రమే పంపండి.
- PDF , Photo copy రూపంలో పంపినవి స్వీకరించలేము.
- కవులు, రచయితలు తమ పేరు, ఊరు, ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయండి.
- అవధాన విద్యా వికాస పరిషత్ సమూహంలో కానీ 9441039146 వాట్సాప్‌కు "అవధాన పుష్కరిణిలో ప్రచురణార్థం" అని వ్రాసి మీ రచనలు పంపవచ్చు.

**- సంపాదకులు**

# సత్కవి ప్రతిభకు తార్కాణం - సమస్యా పూరణం

– శతావధాని డా॥ జి.యం. రామశర్మ

అవధాన కవిపరంపరలో విద్వాన్ మాఢభూషి వేంకటాచార్యుల తరువాత పేర్కొన్న దగినవారు శ్రీ కార్యముపూడి రాజమన్నారు శతావధానిగారు (1846–1916). రాజమన్నారుగారు ప్రకాశం జిల్లా చీరాల పట్టణ సమీపంలోని పేరాల గ్రామ వాస్తవ్యులు. వారు బాల్యంలోనే సంప్రదాయ పద్ధతిలో వివిధ కావ్య నాటక సాహిత్య వ్యాకరణాలంకార శాస్త్రాలను క్షుణ్ణంగా చదివి విద్వత్ కవిగా వినుతికెక్కారు. వారు ఆంధ్ర తెలంగాణా ప్రాంతాలలోని వివిధ సంస్థానాలను దర్శించి అక్కడ విద్వత్కవి పండితులు పెట్టిన కవితాపరీక్షలలో నెగ్గి ఘనంగా సమ్మానితులయ్యారు. వారు పరశ్శతంగా అష్టావధానాలు, పది శతావధానాలు, కొన్ని ఆశుకవితా సభలు సభ్యజనరంజకంగా నిర్వహించి ప్రశంశాపాత్రులయ్యారు. విశేషించి అరవము, ఆంగ్లాది భాషలలో ఇచ్చిన వ్యస్తాక్షరిని కూడ అవలీలగా ధారణచేసి చెప్పగలగడం వారి ప్రత్యేకత. వారి అవధానాలలో కీర్తన, జావళి, పులిజూదం వంటి నూతనాంశాలు ఉండేవట. ఒక అవధానంలో రాజమన్నారు శతావధానిగారికి 'ఇద్దరు భార్యలుండిరి మహేశునకున్ వలె రామమూర్తికిన్' అనే సమస్యనీయగా వారు దాన్ని సరసంగా ఇలా పూరించారు.

ఉ. సుద్దులలో గనుంగొనగ సూనృతవాణి యొకర్తు, దిక్కులం
దద్దయు నాడు నాటికి నుదారత భాసిలు స్వచ్ఛకీర్తియున్
ముద్దియ యొర్తు, జానకిని భూసుత బెండిలి గాకపూర్వమే..
ఇద్దరు భార్యలుండిరి మహేశునకున్ వలె రామమూర్తికిన్

**భావము:** ఏకపత్నీవ్రతుడైన శ్రీరామునకు సత్యవాణి, దిగంతాలలో నర్తించే స్వచ్ఛకీర్తి అనే పేర్లు గల ఇద్దరు భార్యలు సీతను పెండ్లాడక ముందే ఉన్నారని హృద్యమైన పూర్ణన. ఇక్కడ సత్యవాణి, స్వచ్ఛకీర్తి అనే రెండు పదాలు స్త్రీలింగ శబ్దాలు కాబట్టి భార్యలని చెప్పడం సమయోచితంగా ఉంది. ఈ పూరణలో – **'జానకిని భూసుతఁ బెండిలి గాక పూర్వమే'** అనే ముగింపు చమత్కారవంతంగాను, యుక్తియుక్తంగాను భాసిస్తున్నది. మరొకచోట అవధానంలో రాజమన్నారు గారికి 'కారము జూచి దేవుడని గట్టిగ నమ్మెను చిత్రమౌ గదా' అనే సమస్యనీయగా వారు కమనీయంగా ఇలా పూరించారు.

ఉ. ఆరని కన్ను, పెంజడలు, నంటిన బూడిద, బమ్మనుత్తియల్
పేరులు, కుత్తుకన్ విసము, బెబ్బులి చట్టయె బట్ట, నెత్తిపై
నేరును దాల్చి, దా బికిరమెత్తుచు రా, గిరికన్య తా – తదా
కారము జూచి దేవుడని గట్టిగ నమ్మెను చిత్రమౌ గదా!

పరమ శివపరమైన పూరణ. ఇందులో శంకరుని ఆకారం కన్నులకు కట్టినట్లుగా వర్ణితమయింది. "సభీమరూపః శివ ఇత్యుదీర్యతే" అని కుమారసంభవంలో మహాకవి కాళిదాసు వర్ణించినట్లు శంకరుడు ఆకారరీత్యా భయంకరుడైన భక్తులందరికి ఆయన శుభంకరుడే, నమ్మిన దేవుడే. ఈ ధోరణిలోనే ఈ పూరణ సాగింది. విశేషమేమిటంటే సమస్యలోని 'చిత్రమౌగదా!' అనే మాటకు కూడా పూరణలో అన్వయమబ్బింది. ఎలాగంటే శంకరుని భీకరాకారాన్ని చూసిన పార్వతి భయపడలేదు సరికదా ఆయన్ని దేవుడని గట్టిగా నమ్మింది – ఇది చిత్రమే కదా! అని అందమైన ముగింపు. ఈ పూరణలో చక్కటి ఇతివృత్తాన్ని ఎన్నుకోవడంలో, తేటతెలుగు పదాల కూర్పుతో అవధాని నేర్పు ప్రశంసనీయం.

ఈ సందర్భములో – హైదరాబాదులోని శ్రీ సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వారు 'శతావధాని కార్యముపూడి రాజమన్నారు స్మారక పురస్కారాన్ని' ఏర్పరచి ప్రతి సంవత్సరం అవధాన రంగంలో విశేషకృషి చేసిన అవధాని శేఖరులకు ప్రధానం చేస్తున్నారనే విషయం గుర్తు చేసుకోదగినది, కొనియాడదగినది.

(3వ పేజీ తరువాయి) **యయాతి చరిత్ర**

చంద్ర వంశీయుడని, ఆయన పూర్వికులందరూ ఘన చరిత్ర కలిగి, భూలోకంలోనే కాక దేవలోకంలో కూడ ఖ్యాతి వహించిన మహానుభావులని, క్లుప్తంగా ఒక చిన్న సీస పద్యంలో చెప్పకనే చెప్పాడు. తెలగన కవి సీస పద్యాన్ని రమణీయంగా నడిపిన విధానం కూడ ఎంతో ప్రశంసనీయం. క్లుప్త సుందరంగా .. ఒక్కొక్క పాదంలో ... ఒక్కొక్క తరంలోని ఒక మహా ప్రబంధ కావ్య గాథను స్ఫురింప జేయడం ఈ మహాకవి కవన నైపుణ్యాన్ని స్పష్టం చేస్తుంది.

ఒక కవి కృత కావ్యం – చదివేవారి చేత దానిని ఆసక్తిగా చదివింప జేయడమే కాకుండా, మరి కొన్ని మహా కావ్యాలను చదువాలన్న ఉత్సాహాన్ని కూడ కలిగింప జేయడం .. ఆ కావ్యం యొక్క అత్యుత్తమ లక్షణంగా పరిగణింపబడుతుంది. తెలుగు సాహిత్యంలో తొలి సమగ్రమైన అచ్చ తెనుగు కబ్బంగానే కాక, ఈ విశిష్ట లక్షణాన్ని కూడ పొందుపరచుకొన్న గొప్ప కావ్యం – "యయాతి చరిత్ర"!

# రీతులు

# పద్యపరిమళం

- అన్నమరాజు ప్రభాకరరావు

రీతులు "సముచితార్థ పదన్యాస సౌష్ఠవములు". అనగా సముచితములైన పదముల యొక్క చక్కని కూర్పు. ఈ రీతులు వైదర్భీ, గౌడీ, పాంచాలీ అని మూడు విధములు.

1. వైదర్భీ – భావములో సౌకుమార్యము, సౌందర్యము, మాధుర్యము కలిగిన సందర్భమును స్వీకరించునప్పుడు పదములలో సారళ్యమును, ప్రకటనలో స్పష్టతను నింపి యల్పసమాసములతో లేదా సమాసరహితముగ నుంచిన వైదర్భీ రీతి సిద్ధించును.

మధ్యా. తడయక పుట్టిన నాఁడ తల్లిచేఁ దండ్రిచే విడువఁ
బడితి నిప్పుడు పతి చేతను విడువఁ బడియెద నొక్కొ!
నుడువులు వేయు నింకేల యిప్పాటి నోములు దొల్లి
కడిఁగి నోఁచితిని గాకేమి యనుచును గందె డెందమున

(భా. ఆది 4-103)

పుత్రుని తోడ్కొని దుష్యంతుని కడకేగిన శకుంతల నాతడు తిరస్కరించి ఆశ్రమమునకు మరలి పొమ్మనగా, ఆమె "పుట్టిన నాడే తల్లి తండ్రి నన్ను వదలివేసినారు. ఇప్పుడు భర్త కూడా తిరస్కరించుచున్నాడు. ఇది ఏ నోము ఫలమో" అని తనలో తాను బాధపడుచున్న సందర్భము.

పద్యము చదువుచున్నప్పుడే భావ సౌకుమార్యము, శబ్ద సారళ్యము, కరుణ రసము అన్నియు విడి పదములతో, నేరుగా హృదయమును తాకుచున్నవి.

2. గౌడీ – ఇది పూర్తి విశదముగా పదములను పోహళించి చెప్పెడు రీతి. ఘనత, ప్రాగల్భ్యము, సంక్లిష్టత, దీర్ఘ సమాసములు, ధ్వని ప్రధానమైన కఠిన శబ్దములు, విస్మయ పఱచుట, భావముపై శబ్దము యొక్క యాధిక్యము నభివ్యక్తీకరించి సందర్భమును ఉద్దీపింపజేయుట యీ రీతి లక్షణములు.

మ. ఘనధూమధ్వజదహ్యమాన లవలీ కర్పూర తక్కోల చం
దన కాలాగరు సల్లకీ తరుల యుద్యద్ధూమధూపానువా
సన నొప్పెన్ సురభీకృతంబు లగుచున్ సంక్రీడమానామృతా
శన విద్యాధర సద్విమాన వితతుల్ సావిత్రవర్త్మంబునన్

(భా. ఆది. 8-262)

అర్జున సహాయుడైన అగ్నిదేవుడు పూర్ణశక్తితో విజృంభించి నలుదిక్కుల నుంచి క్రమ్ముకొని ఒక్కసారిగా ఖాండవ మహారణ్యమును దహించివేసినాడు. ఆ యరణ్యము లోని యనేక జాతుల ఓషధీ సుగంధ వృక్ష సంతతి కాలుచు వెదజల్లుచున్న పొగలు ఆయా సువాసనలను ఆకాశమార్గానికి (అగ్నికి సన్నిహితుడైన సూర్యమార్గమునకు) చేర్చినాయి.

ఈ యుద్ధృతిని దీర్ఘ సమాసాలతో, క్లిష్ట పదాలతో, భావముపై శబ్దముయొక్క ఆధిక్యముతో అగ్ని యెంత శక్తితో విజృంభించినాడో దృశ్యమానము చేయుచున్న యీ పద్యమును గౌడీ రీతిలో సాగించినాడు నన్నయ్య.

3. పాంచాలీ – వైదర్భీ రీతికిని గౌడీ రీతికిని మధ్య స్థితిలో నుండుచు వైదర్భీ నిరాడంబరతను, గౌడీ ప్రాగల్భ్యమును నిలుపుచూ, నాతి దీర్ఘసమాసములతో, భూషణప్రాయమైన పదాడంబరముతో భాసిల్లుతుంది. సారళ్యము, ప్రౌఢిమల మేలుకలయికతో వైదర్భి వలె నేరుగా కాక, గౌడి వలె అర్థవంతమై ఒక లోతైన భావము నేవిధమైన అతిక్రమణలు లేకుండా నిర్వహించుతుంది.

ఉ. పాలిత దుర్ణయుండు శిశుపాలుడు బాలుడు, వీని నేల భూ
పాలక! నీకు బట్టువఱుపన్ మఱు ధర్మువెఱుంగ వీనికిం
బోలునె రాగకోపపరిభూతమనస్కున, కల్పరాజ్యల
క్ష్మీలలనాంధ బుద్ధి, కనిమిత్త మహత్పరివాదశీలికిన్

(భా. ఆది. 2-22)

రాజసూయ యాగానంతరము అగ్రతాంబూలము శ్రీకృష్ణుని కిడుచుండగా అడ్డుతగిలిన శిశుపాలుని గూర్చి భీష్ముడు ధర్మజునితో పలికిన పలుకులివి.

ఈ శిశుపాలుడు దుర్నీతి నవలంబించి యున్న మూర్ఖుడు. కామక్రోధములతో నిండి యున్న వానిని, తన చిన్న రాజ్యమునే మహా సామ్రాజ్యలక్ష్మిగా భావించుచున్న వానిని, నిష్కారణముగా తగవు పెట్టుకొనే వానిని – ధర్మమెఱిగిన నీవు – ఒప్పించవలసిన పనిలేదు.

నాతి సరళములు, నాతి ప్రౌఢములు నయిన పదములు, ఒక స్థాయి సమాసములు ప్రయోగింపబడి (భీష్మునిచే )ధర్మజునికి సందర్భోచితమైన కర్తవ్యబోధ సభాముఖముగా జరుగుట కనువైన విధముగా పద్య నిర్మాణము జరిగినది. ఇది పాంచాలీ రీతి.

ఈ విధముగా త్రివిధ రీతులను కూడా ఆదికవి ప్రథమాంధ్ర కావ్యములో ప్రయోగించి అనంతర కవులకు మార్గనిదేశము చేసినాడు.

# విశిష్ట తెలుగు భాషా వైభవం- ఛందః ప్రాముఖ్యం

6

- డా. సంగనభట్ల నరసయ్య

వాల్మీకి క్రౌంచపక్షాల జంటలోని వియోగ బాధను తనదిగా చేసుకున్నందుకు అతని బాధాతీవ్రత శ్లోకంగా అవతరించింది. అపుడు తాళాక్షరబద్ధం, తంత్రీలయ సమన్వితం నిర్దిష్ట లక్షణోపేతం శోకోత్థాపిత శ్లోకంగా పరిణమించిందని భవభూతి ఆనందర్ధనుడు మొ॥వారు విశ్లేషించారు. గేయం ఉచ్చరించబడే కాలాన్ని కొలిచే శాస్త్రంగా ఛందస్సు తరువాత అభివృద్ధి పొంది. ఛందస్సులు వేదాలకంటే ముందే గేయాల రూపంలో ఉన్నాయి. వేదాలు ఛందాల్లో రాయబడ్డాయి. అంటే వేదరచనా కాలనికి గేయం కొలతలు వేసి, శాస్త్రం అభివృద్ధి, గాయత్ర్యాదులు శాస్త్రీకరించబడ్డాయి.

ఓం మిమీహి శ్లోక మాస్యే
పర్జన్య యివ తతనః
గాయ గాయత్రం ఉక్థం (ఋగ్వే: 1-38-14)

ఓ ఋత్విక్కులారా! స్తోత్రమును నిర్మింపుడు. మేఘము వర్షమును విస్తరింపజేసినట్లుగా గాయత్రీ ఛందమున గల సూక్తమును గానమొనర్చుడు. ఈ ఆదేశము నందుకొన్నాడా అన్నట్లు విశ్వామిత్రుని కుమారుడు మధుచ్ఛందుడు గాయత్రీ ఛందములో "ఓం అగ్నిమీళే పురోహితం" అంటూ ఋగ్వేదములో ప్రథమ ఋక్కును నిర్మించినాడు.

## ఛందో వ్యాకరణాల మధ్య స్నేహమా! వైరమా?

గేయరచయిత పదాలు పేరుస్తూ పాదం నిర్మాణం చేస్తాడు. పాదానికి కొలత నిశ్వాస పూర్తికావడం. తిరిగి గాలి పీల్చుకునే లోపు పాదం అయిపోతుంది. పాదాతంలో విచ్ఛేదం ఉంటుంది. ఆ విచ్ఛేదానికి యతి అని పేరు. 'యతిర్విచ్ఛేదసంజ్ఞికా' అని ఛందశ్శాస్త్రోక్తి అంటే పాదాంతంలోని తరువాతి పదంలోనికి రాదన్నమాట.

పాదం తిరిగి ముక్కలవుతుంది. ఒక్కోముక్క ఒక్కో కాలఖండం.

కడుపులో దుఃఖం బిడ్డా
ఎంతకూ ఆగదే బిడ్డా

ఈ కాలఖండమే తరువాత గణం ఐంది. కాలఖండాల మూసలో ఆలోచిస్తూ కవి పదాలు లేదా పదబంధాలు ఆ మూసలో పెట్టి పదం పూర్తి చేసి తరువాతి కాలఖండం నింపడానికి ముందుకు వెళతాడు. అంటే కాలఖండాల్లో ఆలోచిస్తూ పోతాడన్నమాట. ఈ పేర్పులో కవి ఒకోసారి ఒకటి, అరమాత్ర ఎక్కువైనా పట్టించుకోడు. ఒక్కో అక్షరం గురువా, లఘువా అని లెక్కించి, గణాల నిర్మాణం చేసే దశకు పూర్వదశ ఇది.

మరుజనక$^5$ మమ్మేలు$^5$ మత్స్యావ$^5$ తారా-$^5$
గురుతుగా$^5$ కృపజూడు$^5$ కూర్మావ$^5$ తారా-$^5$
వక్షమున$^5$ సిరిగల్గు$^5$ వామనవ$^5$ తారా-$^5$

పైపాట రాస్తున్న గేయకారుడు ఒక్కో కాలఖండంలో 5 మాత్రల కాలాన్ని వినియోగిస్తూ పదాలు పేరుస్తూ 4 కాలఖండాలతో పాదం పూర్తి చేసాడు. రెండో పాదం అదే మూసలో పదాలు వేస్తూ పోతాడు. అందువల్ల కాలఖండం (తరువాత కాలంలో గణం) పదసమాప్తితో ఉంటుంది. తరువాతి కాలఖండంలో కొత్త పదం ప్రారంభం అవుతుంది. ఒక్కో కాలఖండం పిదప కూడా విశ్రాంతి లేదా విచ్ఛేదం (యతికి ఇవి పేర్లు) ఉందన్న మాట. దీన్ని ఛందః కర్తలు గుర్తించి **"పాదే పాదే ప్రతిగణమపి యతిర్లక్షతే సర్వేషాం అక్కరాణాం"** అని (జయకీర్తి) చెప్పడం జరిగింది. అంటే ప్రతి పాదంలోని ప్రతి గణం యతిని (విశ్రాంతిని) కోరుతుంది (లేదా నియమింపబడుతుంది) అని అర్థం.

ఈ పాటలో కవి 5+5+5+5 మాత్రల కాలఖండాలకు సరిపడే పదం దొంతరలుగా పేరుస్తున్నాడు. గణాలు సమమాత్రికాలు. పైగా సరిసంఖ్యలో నాలుగు గణాలు ఉన్నాయి. త్రాసులో తూచినట్లు ఈ మొత్తం పాదాన్ని రెండు భాగాలు చేసి 2 గణాలు కాగానే మొదటి భాగం మొదటి అక్షరాన్ని ఎత్తుకుని మూడో గణం మొదటి అక్షరంగా కూర్చోబెట్టినాడు. మరుజనకలోని 'మ', మత్స్యావతారంలోని 'మ'తో యతి వేసినాడన్నమాట. ఈ యతి వల్ల ఈ పాదం 20 మాత్రలు పది పది మాత్రల అర్ధాలు(సగాలు)గా విడిపోయి లయ మరింత స్పష్టమైంది. 20 మాత్రలు కొలతలుగల రెండు వాక్యాలు పక్కపక్క ఉచ్చరించి, వాటి పౌనఃపున్యం వల్ల సాధించే లయకంటే అవి చిన్నచిన్న ముక్కలుగా విడిపోయి వాటి సమాంతర

కాలఖండ సమతవల్ల పుట్టేలయ మరింత స్పష్టం అవుతుంది.

రెండోపాదంలో కవి దశావతారాలలోని రెండో అవతారం కూర్మావతారం కనుక దాన్ని మూడోగణంగా మనసులో స్థిరపరచుకుని దీన్ని మార్చడానికి (అవతారం పేరు ఎలా మారుస్తాడు?) వీలు లేదు కనుక కూర్మావతారంలోని 'కు'కు సరిపడే అక్షరాన్ని ముందే ఎంచుకుని పాదం ప్రారంభించాడు. 'గురుతుగా' అని తొలి కాలఖండం యతి మిత్రాక్షరాన్ని చూసుకొనే మరీ వేసాడన్నమాట. మూడోది వామనావతారం కనుక ఆ పదాన్ని మూడవపాదం మూడోగణం (లేదా కాలఖండంగా) స్థిరపరచికొని దానికి యతి మైత్రి కోసం **'వామన'**లోని **'వా'**కు స్నేహంగా **'వక్షమున'** అనే పదం తొలిగణం(కాలఖండం)గా వేసి పాదం రాయడం మొదలు పెట్టినాడు.

ఐతే ఇక్కడ ఒక చిక్కు వచ్చింది. ప్రతి కాలఖండం ఐదేసి మాత్రలు గలదే వెయ్యాలి గదా! మాత్రలు దాటితే ఎక్కువ మాత్రల పదం వేస్తే? అమ్మో! లయ చెడిపోదూ! మత్స్యావ$^{5}$తారా–$^{5}$, కూర్మావ$^{5}$తారా–$^{5}$ అనే చోట్ల పదేసి మాత్రలు. మరి వామనావ$^{6}$తారా–$^{5}$ వద్ద మూడోగణం 6మాత్రలు, తారా – 5మాత్రలు పడ్డాయి. ఈ సందర్భంలో వామనావతారాలోని **'వామనావ'** కాలఖండాన్ని 5మాత్రలకు కుదించి చదవాలి. ఒక్కమాత్ర తగ్గినా వామనుడనే అర్థం మారదు. కాలఖండం కొలత చెడితే (ఒక్కమాత్ర ఎక్కువైతే మాత్రం) లయ చెడుతుంది. కనుక ఈ తగ్గింపును శ్రద్ధ పెట్టమంటూ **"అపి మాషం మషం కుర్యాత్ ఛందోభంగం న కారయేత్"** అని ఛందశ్శాస్త్రం అంగీకరిస్తూ నియమం చేసింది. కానీ దీనికి విరుద్ధంగా దీర్ఘం హ్రస్వం ఐనా, అక్షరం మారినా అర్థాలు మారిపోతాయని వ్యాకరణశాస్త్రం కఠినంగా శాసించింది. **"యద్యపి బహూనాధీషే తథాపి పఠపుత్ర వ్యాకరణం, స్వజనః శ్వజనో మా భూత్ సకలం శకలం సకృత్ శకృత్"** అని వ్యాకరణ నియమం.

కాంతిని కంతి అని ఒకమాత్ర తగ్గించి ఉచ్చరిస్తే **'వెలుగు'** కాస్త **'వాపు'**గా మరదా? అలా అని విష్ణుమూర్తిని "నాయనా! నీవు ఏ అవతారమెత్తినా మా పాట కోసం అవతారం పేరు ఐదుమాత్రలు వచ్చేలా పెట్టుకుని మరీ పుట్టవయ్యా!" అని అనగలమా? అవతారాల పేర్లు మారుతాయా?

మాత్రలు తగ్గవచ్చని పెరుగవచ్చని, కాలఖండం ముఖ్యం కాని, పదంలో ఓ అక్షరం కుదరకున్న హెచ్చుతగ్గులైనా పరవాలేదని ఛందశ్శాస్త్రం చెపుతోంది. పైన **'వామనావ'**ను **'వమనావ, వామావ, వామనవ'** అని ఈ రీతిగా అధికమాత్రను కుదించి ఎలాగైనా చదువవచ్చని ఈ శాస్త్రం చెప్తే, 'వమనావతర' ఏమిటి? ఏమిటా కుదింపు? వామనావతారం వమనావతారం (వమనం అంటే వాంతి వాంతి అవతారం వికృతార్థం కాదా అని) వంటి మార్పులు అంగీకరించవద్దని వ్యాకరణం చెప్తోంది. నడక గూర్చి ఆ శాస్త్రం, అర్థం గూర్చి ఈ శాస్త్రం పేచీలుపడ్డాయి. త్ర్యక్షర గణవ్యవస్థలో ఇలాంటి వెసులుబాటులు కూడదని, అలా చేయడం కవిత్వం రాయడానికి చేతగాని వాని లక్షణమని చెప్తూ

**"గురువు లఘువు జేసి కుంచించి కుంచించి**
**లఘువు గురువు జేసి లాగి లాగి**
**కవిత చెప్పునట్టి కవి గులామును బట్టి**
**ముక్కు కోయవలయు తొక్కి పట్టి"** అని ఈసడించినారు.

క్రీ.శ. 10వ శతాబ్ది వాడైన మల్లియ రేచన (తెలుగువారి తొలి ఛందోగ్రంథమైన) 'కవిజనాశ్రయము'లో ఇలాంటి పాటలను, పాటలలోని కాలఖండాల కొరకు పదాలు మార్పుకు లోను కావడం చూసి, అలా రాయవద్దని దోషమని పండిత దృష్టితో విమర్శించినాడు.

**కం. వెలయగ చెఱాకు వెలుగొని**
**యలరమ్ముల చేతబట్టి యంగజుడు విరా**
**హుల నేయ నేర్చు కడిమిన్**
**తొల మెలయగ ననిన కాకు దోషంబయ్యెన్** (దోషా–25)

చెఱకును చెఱాకు అని విరహులను విరాహులని రాసిన ఏదో ఒక గేయం చతుర్మాత్రికా గణములతో చతురస్రగతిలో నడిచే తన కాలంనాటి దానిలో ఈ మార్పును చూసి దోషంగా వారు భావించినా జానపద గీతాల్లో ఇది తప్పుకాదు.

**'నడక'** కోసం మార్చుకొమ్మని ఛందశ్శాస్త్రం, మారిస్తే అర్థాలు మారిపోతాయి, మార్చవద్దని వ్యాకరణశాస్త్రం పరస్పరం విరుద్ధ భావాలు ప్రకటించినాయి. వేటి పరిధి, ప్రయోజనం వాటిది. ఇది జరగడానికి కారణగాథ.

ఐతే వీటిమధ్య సయోధ్య కూడా ఉంది. **హ్రస్వం లఘు, సంయోగే గురు, (సంయోగే పరే హ్రస్వం గురుసంజ్ఞం స్యాత్), దీర్ఘం చ (దీర్ఘం చ గురుసంజ్ఞం స్యాత్) అని, ఆద్యోః వళి, ద్వితీయో వర్ణః ప్రాసః** అని వ్యాకరణ శాస్త్రాలు ఛందస్సు గూర్చి చెప్తే, **"ఏకమాత్రో భవేద్ధ్రస్వః, ద్విమాత్రో దీర్ఘ ఉచ్యతే, త్రిమాత్రాస్తు ప్లుతో జ్ఞేయః, వ్యంజనంత్వర్ధమాత్రకం"** అని ఛందశ్శాస్త్రాలు స్వరభేదాలను వ్యాకరణాంశాలకు అనుబంధంగా తెలిపాయి.

(సశేషం)

## గుంటూరులో 'తెలుగు కావ్య మథనం' వారి వార్షికోత్సవ సభలో 'అవధాన రాజహంసిని' శ్రీమతి బులుసు అపర్ణగారి అష్టావధానం

**01.02.2026**




**అధ్యక్షులు:** నైనాల వాణీశ్రీ
**సంచాలకులు:** తొగట సురేశ్ బాబు

**నిషిద్ధాక్షరి:** పంతుల విట్టుబాబు

**'ఉ,ఊ,క' అనే అక్షరాలు లేకుండా గుంటూరు కారం వర్ణన**

కం. తరమే యీ స్థలి మిర్చిని
మరలఁగఁ జేయఁగ వశమ్మె మరిమరి తలపన్
ధరణిని చవిగొన నమృతమె
వరమై చనదే రసనలె వహ్వా యనగన్!

**సమస్య:** నడిమింటి మార్కండేయ శర్మ

**తనసుతన్ బెండ్లాడు మనుచుఁ దాతను వేడెనొక్కండు**

మధ్యాక్కర తన గృహశ్రీని, లక్షణను, దన్విని, ముద్దుతనూజ
ఘనతర సౌందర్యరాశిఁ, గమనీయ సుగుణాలపేటిఁ
గొనుమంచును నగాధిపతియుఁ గూరిమి పశుపతిఁ గోరెఁ
దనసుతన్ బెండ్లాడుమనుచుఁ దాతను వేడెనొక్కండు

**దత్తపది:** గోలి హనుమత్ శాస్త్రి

**'డిసెంబర్-జులై-మార్చి-మే' పదాలతో నూతన సంవత్సరానికి (పరాభవ) స్వాగతం చెప్పుట**

తే.గీ. బ్రతుకు నేమార్చి మోహంపు వలలఁ ద్రుంచి
పూర్ణమనుజులై సద్భక్తిపూర్ణు లగుచుఁ
బలుకమే స్వాగతాంజలి కలికి చిలుక!
బాధల తడిసెం బరువై వత్సరమిది!

**వర్ణన:** డా. శ్రీనివాస్ నాగులాపల్లి

**వీక్షకులు లేని అవధాన సభలో నిర్వాహకుల, అవధాని మనోభావన**

ఉ. మింటను సూర్యచంద్రులును మేలుగఁ గానఁగరాని వైఖరిన్
జంటకు మాఘసూనములు సఖ్యత గోర్వఁగలేని యట్టులన్
కంటికిఁ గాటుకల్ కనని కామిని లోచనయుగ్మమట్టులన్
తంటయె మాకునందఱకుఁ దారు వహింపని పద్యకేళినాన్

**వ్యస్తాక్షరి:** బైరోజు రాజశేఖర్

**గతకాలము మేలు వచ్చు కాలముకంటెన్**

**వారగణనం:** నండూరి వెంకటేశ్వరరాజు

1. 18-10-1895 శుక్రవారం
2. 18-11-2019 సోమవారం
3. 19-10-1952 ఆదివారం
4. 28-05-1923 సోమవారం

**ఆశువు:** కర్ణాటి చంద్రమౌళిని

1. **క్షీరసాగర మథనం నుంచి అమృతం ఉద్భవించినట్లుగా, తెలుగు కావ్య మథనం నుంచి అమృత గుళికల వంటి పద్యాలను వెలికి తీస్తున్న శ్రీ పూసపాటి గారి కృషి**

తే.గీ. ఆంధ్రభాషామతల్లికి నాయువైన
పద్యసత్ఫలరాశినిఁ బదుగురకును
బంచిపెట్టగ నెంచెడు భారతాంబ
ముద్దుపట్టియునౌఁ గాదె పూసపాటి. →→



## 04.02.2026 బుధవారం ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళం జిల్లా ఉర్లాంలో జరిగిన త్రిగళ అష్టావధానములో భాగంగా.. 7వ తరగతి విద్యార్థిని చి. నృసింహదేవర జయలక్ష్మి గారి సంస్కృత అవధాన పూరణలు

**అధ్యక్షులు:** బంకుపల్లె రమేశ్ శర్మ

**సంచాలకులు:** డా. ధూళిపాళ మహాదేవమణి

**నిషిద్ధాక్షరి:** డా. మండపాక మహేశ్వరి

**అనుష్టుప్‌లో అరసవిల్లి సూర్యనారాయణమూర్తి వర్ణన**

వరం స్థం ఖే సఖే భవ్యం విభుమీద్యం హి భావయ ।
హర్షవల్లీగతం సూర్యం అంబుజాతాప్తమీశ్వరం॥

**వర్ణన:** భాస్కరభట్ల సత్య ప్రసాద్

**మహావిష్ణు - సూర్య**

యశ్శంఖచక్రాఢ్య కరాబ్జయుగ్మః సరోజయుగ్మాంఛితరుక్మతేజాః।
మధ్యేగతో సౌర సుమండలస్య ప్రపాతు లోకైకవిభుః పరాత్మా॥

**న్యస్తాక్షరి:** డా. జ్యోశ్యుల హరి ప్రసాద్

**1/3 యో, 2/5 గ, 3/7 క్షే, 4/6 మం - భారతార్థంలో**



**సమస్య:** డా. ధూళిపాళ అన్నపూర్ణ

**పితరం మే జననీ కరప్రహరణం కృత్వా జనైః సంస్తుతా**

క్వచిదంభోరుహబంధుసూనురవదత్త్యైవం స్వమిత్రం ప్రతి
దినదం తప్తసుహాటకచ్ఛవిమహో సప్తాశ్వ సద్వాహనం।
శృణు సంజ్ఞభిద విశ్వకృత్తనుభవాద్దేవం సదాత్మేశ్వరం
పితరం మే జననీ కరప్రహరణం కృత్వా జనైః సంస్తుతా॥

**దత్తపది:** మరుమాముల దత్తాత్రేయ శర్మ

**'హస్త-చిత్త-స్వాతి-విశాఖ' పదాలతో ఉర్లాం శ్రావణి మహోత్సవం**

శూలహస్తాశిషానిత్యం శ్రావణే చిత్త మోదనం ।
స్వాతీమౌక్తిక స్వచ్ఛత్త్వైః విశాఖానికటే భవేత్॥

కృష్ణ!యోద్ధుం నశక్నోమి స్వామిన్ హే యోగపారగ।
బ్రూహిమే యత్పరం క్షేమం సాధిఖిన్నతమం విభో॥

**ఆశువు:** వేమకోటి వేంకట సుబ్బలక్ష్మీ నృసింహ శర్మ

**జయలక్ష్మి పేరు వచ్చేట్టుగా అమ్మవారి వర్ణన**

మహిషాసుర సంహంత్రీం వేదవేదాంత వందితాం ।
జయలక్ష్మీం జగద్ధాత్రీం స్తౌతిమే గురురచ్యుతాం॥

**ఘంటావధానం:** రేజేటి శ్రీనివాసశర్మ, గురునాథులు

**అప్రస్తుతం:** భాస్కరభట్ల శ్రీరామశర్మ

→ →

**2. గుంటూరు కారము కంటిలో నీళ్ళు తెప్పిస్తే, గుంటూరు వారి ఆతిథ్యపు మమకారము కళ్ళను చెమ్మగిల్లేలా చేస్తుంది.**

తే.గీ. రుచులఁ బంచెడు కారమ్ము రోచకమ్ము!
ఎడదకున్ మమకారము కడు సుఖమ్ము!
రెంటి కలయిక గుంటూరి యింటఁ జూడ
రసన హృదయాలఁ జవులూరు రాజసముగ.

**3. రాయలసీమలో కరువు కారణంగా కష్టజీవులు పత్తి, మిరప తెంపేందుకు గుంటూరుకు వలస రావడం**

ఆ.వె. కత్తిమీద సాము కాక జీవనములు
పత్తి మిరప చేలు పసిడులీన
రైతు బ్రతుకు పండి రాష్ట్రమ్ము మెండుగా
వెంట నుండవలయుఁ బంటలందు.

**4. మద్యానికి అలవాటు పడినవాడు మత్తుతో హాయిగా నిద్రపోతే, పద్యానికి అలవాటు పడినవాడు పద్య నిర్మాణంలో ఆపసోపాలు పడుతూ నిద్రలేమికి గురి కావడం.**

కం. మద్యము తెలివినిఁ ద్రుంపగఁ
బద్యము తెలివికి నిరతముఁ బట్టును సానన్
సేద్యముఁ జేయుడి క్రమముగ
హృద్యపు కవనంపుధార హేలగ వచ్చున్.

**అప్రస్తుతం:** పూసపాటి కృష్ణసూర్యకుమార్

# పద్యపరీమళం

పరగు షడ్జాది సప్త స్వరంబులు మంద్ర
మధ్య తారకతానమార్గములును
బురుషాంగనారాగములు ముప్పదియు రెండు
వాని మిత్రంబులు వరుస నెఱిగి
కాలక్రియామాన గతులతో దాళంబు
లెఱిగి మూర్ఛన వృత్తు లేర్పరించి
గీతంబు దరువు జక్కిణి చిందు మొదలుగా
నొక్కొక్క వర్ణంబు నుగ్గడించి
శుద్ధసాలగ సంకీర్ణ శోభితముల
శ్రుతులు జెడకుండ చెవులకు సొగసు గులుక
వేణునాదంబు మొరయించె రాణ మెఱయ
మదన గోపాల మూర్తి యమ్మాధవుండు

ఈ పద్యం వెన్నెలకంటి సూరనార్య ప్రణీతంబైన ఆంధ్ర శ్రీవిష్ణు పురాణము లోని సప్తమాశ్వాసము లోనిది. యమునాతీరంలో కృష్ణుడు వేణువు నాలపించిన సందర్భం.

విష్ణు పురాణమును ఎనుబది వేల గ్రంథముగా పరాశర మహర్షి చెప్పినట్లుగా వ్యాసుడు రచించాడు. ఇది రెండు భాగములు. దాదాపుగా మొదటి భాగమును పొన్నికంటి సూరన తెనిగించారు.

నిషాదము, ఋషభము, గాంధారము, షడ్జమము, మధ్యమము, దైవతము, పంచమము అనే ఏడు స్వరాలతో కూడిన వేణురాగం ఆలపించడం మొదలెట్టాడు శ్రీ కృష్ణుడు. ఇది మంద్ర మధ్య తాన మార్గములో సాగింది. ఇవి సంగీతం లోని స్థాయిభేదాలు. మంద్ర అనగా తగ్గుస్థాయి, మధ్యమం సాధారణ స్థాయి, రాగానికి చెప్పిన త్రయోదశ లక్షణాలలో తార, మంద్రం మొదలగు స్థాయిభేదాలు ఉంటాయి. తన్నకారముతో పాడే పాట తానము. సంగీత రచనలో ఏ భాగమునైనా అంగము అంటారు. పురుషాంగ నారాగములు అంటే అర్థం కాలేదు. సంగీత పరిజ్ఞానం ఉన్న వారు చెప్పాలి. వీటిని ముప్పది రెండు గా చెప్పారు కవి. పదహారు స్వరాలకు 32 మేళకర్తలు చెప్పబడ్డాయి. వాటి మిత్ర రాగాల వరుసలో వీటిని కృష్ణుడు ఆలపించాడు. పుత్ర, మిత్ర, కళత్ర రాగాలు ఉంటాయి. ఒక సంగీతం ఛాయను పోలి ఉండేది మిత్ర రాగం. వీటి పేర్లు కూడా సమీపంగా ఉంటాయి. ఉదాహరణకు రంజని రాగానికి శ్రీరంజని, మనోరంజని రాగాల లాగా. ఇవి నారద మహర్షి సంగీత మకరందంలో చెప్పబడ్డాయి. వీటిని సరియైన తాళంలో కాలక్రియామాన గతులతో ఆలపించాడు. కాలము అనేది తాళ దశ ప్రాణాలలో నొకటి. సంగీతం యొక్క నడక ప్రథమ ద్వితీయ తృతీయ చతుర్థకాలములలో ఉంటుంది. క్రియ కూడా ఇందులోనిదే. ఇది తాళమును ఎంచే పద్ధతి. ఈ రకంగా రాగ తాళాల పరిజ్ఞానంతో మూర్ఛన వృత్తులతో ఆలపించాడు. సంగీతం లోని క్రమముగా సప్త స్వరముల యొక్క ఆరోహణావరోహణలను మూర్ఛన అంటారు. వీటిని ఏర్పరచి గీతము, దరువు, జక్కిణి చిందు మొదలగు వర్ణాలు ఆలపించాడు. వీటిలో గీతం అనేది సరళమైన సంగీతం. ఇది లయతో కూడి చరణం పల్లవి లాంటివి లేకుండా ఒకరాగంతో సాగుతుంది. దరువు, జక్కిణి పర్యాయ పదాలు గానే ఆంధ్రభారతిలో చెప్పబడ్డాయి. అయ్యలరాజు రామ భద్రుడు రామాభ్యుదయంలో "అణునిభమధ్యలా క్రియలు నా



పరిభాషలు నొప్ప జిందు, జిక్కిణి, కొరవంజి మేళముల కేళి సల్పిరి" అనడంలో ఇవి కొన్ని నాట్య భేదాలుగా అర్థం చేసుకో వచ్చు. కృష్ణుని వేణు గానంతో తన్మయత్వంతో కూడిన నాట్యాలు వేసారు కాబోలు. ఆశ్చర్యంగా ఇవి జానపదాలు. స్వరాలు శాస్త్రీయాలు. గొల్లలు జనపదులే కాబట్టి వేణువు కూడా జానపదులదే కాబట్టి ఈ రకమైన వర్ణన ఔచిత్యంగా ఉంది. వీటిని కలుపుతూ సంకీర్ణ రాగాలు ఏర్పరచాడు. ఇవి శుద్ధ సాలగ సంకీర్ణ శోభితములు.

సాలగ అంటే రాగాల కలగలుపు. శుద్ధరాగాలను సంకీర్ణం చేసి శ్రుతులు చెడకుండా వీనుల విందుగా కృష్ణుడు వేణువు నాలపించాడు. మదన గోపాలుడంటూ చమత్కారంతో పద్యం ముగించారు కవి. మదన గోపాలుడంటే గోపాలురకు సంతోషం కలిగించేవాడు. తన వేణునాదంతో సంతోషమే కాదు తన్మయత్వమే కలిగించాడు కృష్ణుడు. మాధవునిగా కృష్ణుని అభివర్ణించడంతో ఇక్కడ కాలక్రియామాన గతులు చెడకుండా సరియైన సృష్టి స్థితి కాపాడుతున్న విష్ణుమూర్తిని శ్లేషగా గుర్తుకు తెచ్చారు కవి.

**- చేపూరి శ్రీరామ్ అవధాని , హన్మకొండ**

# పూరణతోరణం

**నిర్వహణ: 'అష్టావధాని' కంది శంకరయ్య**

## సమస్య

"నత్తిన్ గల్గినవాని వాక్పటిమ కర్ణప్రీతిఁ గూర్చున్ గదా"

**అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి, హైదరాబాదు**

వృత్తాంతమ్మును చెప్ప పూనుకొని నావేశమ్ముతో చూచుచున్
చిత్తమ్మందున కోర్కె పెంపెసగగా చిచ్ఛక్తి  చూపించుచున్
మత్తున్ వీడుచు బొట్టె తొట్రుపడి సమ్మానమ్ముతో పల్కగా
నత్తిన్ గల్గిన వాని వాక్పటిమ కర్ణ ప్రీతిన్ గూర్చున్ గదా!

**ఆరవల్లి శ్రీదేవి, హైదరాబాదు**

కత్తిన్ జూపుచునుత్తరించెదననన్ కంఠమ్ముపై నుంచగా
బత్తిన్వేడుచు రక్షరక్ష యనగా విశ్వేశునే గొల్చుచున్
చిత్తంబందున విష్ణురూపు దలచన్ శ్రీమంత్రమున్ బల్కగా
నత్తిన్ గల్గినవాని వాక్పటిమ కర్ణప్రీతిన్ గూర్చున్ గదా!

**కవుతా రామకృష్ణ**

విత్తాదృష్టరమాదయేక్షణము లీ పృథ్వీతలంబందునన్
హత్తంగానొక నత్తివానిఁ దన భాగ్యాధిక్యమోయంచనన్
బుత్తెంచున్ జనకోటి సంస్తుతులలో ముంచెత్తగాఁ జోద్యమా
నత్తిన్ గల్గినవాని వాక్పటిమ కర్ణప్రీతిఁ గూర్చున్ గదా!

**కశోర్ఘుల నాగేశ్వర్ శర్మ, ధర్మపురి**

రిత్తన్ బోవగ జీవనమ్ము గడిపెన్ రిక్తాస్యుడై కానలన్
నత్తిన్ గల్గిన యో యనామకుడు వీణన్గల్గు మూర్తిన్గనెన్
సత్తిన్ దెచ్చుకొనంగ మ్రొక్కఁగనిడెన్ శక్తీశ్వరీ,విద్యలన్
నత్తిన్ గల్గిన వాని వాక్పటిమ కర్ణ ప్రీతిఁ గూర్చున్ గదా

**కొరుప్రోలు రాధాకృష్ణ రావు**

చిత్తంబందున హాస్యలాస్యములతో చిత్రంబు సిద్ధంబునై
యెత్తైత్తా సుమసాహితీసుధలతో నింపైన దృశ్యంబులున్
మత్తేభంబుల పద్యపాదములను న్మన్నించు వైచిత్రితో
నత్తిన్ గల్గినవాని వాక్పటిమ కర్ణప్రీతిఁ గూర్చున్ గదా!

**గుండా వేంకట సుబ్బ సహదేవుడు, ప్రొద్దుటూరు**

చిత్తంబందున కాళికా జననినే సేవించి విద్వత్తునన్
ముత్తెంబయ్యెను కాళిదాసు కవియై భోజుండు గీర్తింపఁగన్
సత్తెంబెంచఁగ మాత వాణి కరుణన్ సాధింప నభ్యున్నతిన్
నత్తిన్ గల్గిన వాని వాక్పటిమ కర్ణప్రీతిఁ గూర్చున్ గదా!

**పి.ఎల్. నాగేశ్వర రావు, హైదరాబాదు**

చిత్తంబందున భక్తినిల్పి కవి తా శృంగేరి పీఠమ్మునన్
గత్తుల్ దూసి వధానమంద్నఁ గవితాగాంభీర్యమున్ జూపుచున్
దత్తాంశంబుల నప్పచెప్పు దరి వ్రాతన్ జూపె! లేకున్న నా
నత్తిన్ గల్గినవాని వాక్పటిమ కర్ణ ప్రీతిఁ గూర్చున్ గదా!

**పెనుకొండ రామబ్రహ్మం, బెంగుళూరు**

విత్తంబొందిన నీతి బాహ్న్యుడటు నిర్భీతిన్ మురారిన్ మదో
న్మత్తుండై బహు నిందఁ జేయఁ గనలన్ మాన్యుండు సద్వర్తనన్
జిత్తంబందున నచ్యుతున్ గొలిచి సుశ్రేయంబులన్ బల్కగన్
నత్తిన్ గల్గినవాని వాక్పటిమ కర్ణప్రీతిఁ గూర్చున్ సదా!

**మంకు శ్రీను, కొప్పర్రు, ప.గో. జిల్లా**

సత్తిన్ జంపును శ్రోతృపాళికిలలో శ్రావ్యంబుగాలేని- ఆ
నత్తిన్ కల్గినవాని వాక్పటిమ- కర్ణప్రీతి కల్గున్ కదా
బత్తిన్ శాస్త్రవివేకవంతుడొకచో వాక్రుచ్చుచో వేదికన్
ఎత్తున్ పత్రికలెల్ల వాని పటిమన్నీ విశ్వముల్ మెచ్చగన్.

**రాకుమార, గోదావరిఖని**

చిత్తంబందువిషంబులేక సుధలన్ చిందాడునందమ్ముతో
పెత్తందారుతనంబుజూపుదొరయై వేదాత్మసంభూతమౌ
పొత్తిళ్ళన్ సుఖియించునింటిసిరియౌ బుజ్జాయిముచ్చట్లలో
నత్తిన్ గల్గిన వానివాక్పటిమ కర్ణప్రీతిగూర్చున్ గదా.

**విమల ఆర్యసోమయాజుల, బెంగుళూరు**

ముత్తాతల్ ఘనపారు లంచు, తన సమ్మోదంబునే దెల్పి, మే
నత్తే కూతునొసంగె నాదరముతో నల్లుండటంచున్ వెసన్
మత్తున్ ముంచిరి మద్యమే యొసగి, నామాధుర్య వాగ్ధాటిలో
నత్తిన్ గల్గిన, వాని వాక్పటిమ కర్ణప్రీతిఁ గూర్చున్  గదా.

**డా. వేదాల గాయత్రీదేవి**

చిత్తమ్మందున ప్రేముడిన్ నిలుపుచున్ చిన్నారి సంభాషణల్
ఒత్తుల్ పల్కగలేని వేళనయినన్నుత్సాహమందించు నా
సత్తిన్ తలిదండ్రి మెచ్చునవనిన్ సంతోషముప్పొంగ నా
నత్తిన్ కల్గినవాని వాక్పటిమ  కర్ణప్రీతి గూర్చున్ గదా!

**వేమరాజు వేంకట కృష్ణ కుమార్**

కత్తిన్ పట్టిన బాలకృష్ణ వలె శృంగారంబు చిందించు చున్
చిత్తంబందున నారసింహుగని జేజేలంచు పల్కన్ సదా
మత్తున్పొం దియు మెచ్చు ప్రేక్షకులు; కామాంధంబుగా నెంచు నా
నత్తిన్ గల్గిన వాని వాక్పటిమ కర్ణప్రీతిఁ గూర్చున్ కదా!

**డా. శాస్త్రుల రఘుపతి, హైదరాబాద్**

విత్తమ్మే తన జీవితాశయముగా వేవేలుగా దాచు ఉ
న్మత్తున్ భ్రష్టుని చుట్టు జేరిన జనమ్మందున్ స్తుతుల్ జేయునా
తొత్తుల్ గా భజియించు వారలకు నా ధూర్తాగ్ర దుష్టాళికిన్
నత్తిన్ గల్గినవాని వాక్పటిమ కర్ణప్రీతిఁ గూర్చున్ సదా.

**శిష్టా వి.ఎల్.ఎన్. శర్మ, హైదరాబాద్**

వత్తుల్బల్కగలేడు సంగతిని సంభావించి భాషించగా
భిత్తంబందుచు సాగదీయునట దాపించంగ నావృత్తమున్

చిత్తంబందున నిల్పి భావనల రోచిన్నింపు నావాక్యమున్
నత్తిన్ గల్గినవాని వాక్పటిమ కర్ణ ప్రీతి గూర్చున్ గదా!

## దత్తపది

**'దోమ - ఈగ - చీమ - బల్లి' పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ మత్తేభ వృత్తంలో 'చరవాణి'పై పద్యం**

**అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి, హైదరాబాదు**

మ. మనమున్ గైకొనె నెట్టిదో మహిమచే మత్తెక్కగా జేసె ద
క్షిణ హస్తమ్మది జేరి శీఘ్రమ్ముగ, పూచీ మన్ననన్ వీడినన్
వణిజుం, డీగతి పొందుచుండిరి జనుల్, భావించి భాగ్యమ్ముగా
ఘనమౌ నీ చరవాణి బల్లిదులు, సత్కారమ్ముగా గైకొనన్.

**ఆరవల్లి శ్రీదేవి, హైదరాబాదు**

మ. ధరపై దోమని పళ్ళెరమ్ములటులన్ తండ్లాడుటేలీలగా
వరుసల్ గట్టరె యీగదంచుమరితావాదించి కయ్యాలచే
పరుసంబాడుచు చీమకాలుగన చర్వాణిన్ వరించున్నిత్యమున్
వరసౌవానికిబల్లిదుల్వ్వెరసి నవ్వారింబ్రశంసింపగా!

**కశోర్ఘుల నాగేశ్వర్ శర్మ, ధర్మపురి**

మ. ఇది యేదో మన చేతిలోనిమిడి యంతర్జాలమున్జూపుచున్
మదులందీగగ యింపుగాను మన ప్రీత్యభీష్టముల్దీర్చగన్
కదిలించీ మన జీవితమ్ముల్మ గడపన్నత్యద్భుతంబౌ; సుబ
ల్లిదమైనట్టి యనన్య ప్రజ్వలిత సద్విద్యా ప్రవాహమ్మయెన్.

**గుండా వేంకట సుబ్బ సహదేవుడు, ప్రొద్దుటూరు**

మ. చరవాణిన్ గనఁ గ్రమ్ము దోమటియె! హస్తంబందునన్ భూషయై
ధరపై పిల్లలు పెద్దలీగతిని విద్యాధిక్యులై దానిదౌ
జెరలో బల్లిదమంద్రుఁ జిక్కి బలియై జీవింత్రు నాశాన, కొం
దరె వృద్ధిన్ సురుచీమయంబు గనెడున్ ధ్యాసన్ బ్రవర్తిల్లరే

**పి.ఎల్. నాగేశ్వర రావు, హైదరాబాదు**

మ. కరమందో మహతీ యనంచు నిను నొక్కం జూడ నుత్సాహులై
యరయన్ బల్లిదురాలియై తలచి భార్యాభర్తలే వీడుచో
మరి చీమంతయు జాలిలేక, ధర దుర్మార్గంబు హెచ్చెన్ వడిన్!
చరవాణీ! ప్రజ యీ గతింబడిరి 'నిశ్శబ్దంబు' నిన్ వాడుచో!

**పెనుకొండ రామబ్రహ్మం, బెంగుళూరు**

మ. కరమందొప్పుచు న్దఁడు దోమడికి నిక్కంబెంచఁగన్ మిన్నయై
నరులన్ గట్టె గదయ్య యీ గతిని విన్నాణమ్ముతో దాసులై
వరలన్ మిక్కుటమౌ రుచీ మహిమ మేపారంగఁ జిత్తంబునన్
జరవాణీ స్థిత బల్లిదమ్ముల్మ గని దుస్సాధ్యమ్ము వర్ణించఁగన్.

**రాకుమార, గోదావరిఖని**

మ. ద్యుతి సూచీమయరాగబంధనుడి మాధుర్యంబుజేకూర వి
స్తృతమౌరీతిని పెద్దదో మదినిసంజాయింప చిన్నారియై
స్మృతిపాఠమ్ములువీనులందొరల సంచారింపుజుంటీగయై
సతతం బల్లిదశస్త్రమైనొదిగె విజ్ఞానంపుసంగాతినన్.

**విమల ఆర్యసోమయాజుల, బెంగుళూరు**

మ. వినరా'దో మ'రి వీనులంబడెడు నావిజ్ఞాన సర్వస్వమున్
ఘన వాక్చాతురి గల్గు' నీగ'తిని సంకల్పంబు చేయంగ ,ద
ల్చిన దివ్యుండు, మహానుభావుడు ,విపం'చీమంజునాదంబుతో
ఘనమౌశక్తిని గూర్చు,బల్లిదుని మేధాశక్తి సామాన్యమే.

**డా. వేదాల గాయత్రీదేవి**

మ. వినగా మోజును పెంచదో,మనములో వేరీతి ఘోషించుచున్
కనగా నేడిది బల్లిదంపు తొడవై కాలంబునేదోచెడిన్
మునుగన్ జేయు,వివాదవాదములలో ముచ్చట్లతోనీగతిన్
మనహస్తంబున భూషయయ్యె,సురుచీ!మాయావి చర్వాణియే.

**డా. శాస్త్రుల రఘుపతి, హైదరాబాద్**

మ. గమనింపం గనలేరుగా జనుల "ఈగ"మ్యమ్ము తామెంచగన్
సమయమ్మున్ మదిగాంచకన్ వృథగ నిచ్ఛాశక్తినే"దో మ" హో
ద్యమమున్ సల్పెదు వారి బోలె ధరణిన్ వ్యర్థమ్ముగా "బల్లి"దుల్
తమితో నాచరవాణి మాయల పడన్ తామెన్నరౌ "చీ మ"దిన్.

> **సమస్య:** కమలంబునఁ బుట్టెఁ గలువ గనులకు విందై
>
> **దత్తపది:** 'ఆటో - కారు - జీపు - లారీ' పదాలను ప్రయోగిస్తూ మహాభారతార్థంలో - స్వేచ్ఛాఛందంలో
>
> (పూరణలు **15** మార్చి **2026** లోపు **7702121376** ఫోన్ నంబరుకు పంపాలి)

**ప్రకటన**

అవధానకళ భావితరాలకు నిరంతరాయంగా ప్రవహింపజేయడంలో మా వంతు కృషిగా అవధాన విద్యను యువతరానికి బోధించడానికి, **'అవధాన విద్యా వికాస పరిషత్తు'**ను ఏర్పాటు చేసి **2022**వ సంవత్సరం నుండి నాలుగేళ్ళుగా 'భాగ్యనగరం'లో ఏడురోజులపాటు **'అవధాన శిక్షణ శిబిరాలను'** నిర్వహిస్తూ వస్తున్నాం. అలాగే ఈ **2026**వ సంవత్సరం కూడా **మే 18 నుండి 24 వరకు** శిక్షణ శిబిరం ఏర్పాటు జరుగుతుంది. వేదిక సెయింట్ మార్క్స్ హైస్కూల్, దీనదయాల్ నగర్, నేరేడుమెట్టు, మల్కాజిగిరి, హైదరాబాద్. వివరాలకు **9441039146, 8555082034** ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు. **- సంపాదకులు**

# పద్యకవిత్వము సాధుప్రయోగాలు - 6

- 'అష్టావధాని' చిటితోటి విజయకుమార్




ఒక్క అక్షరం మారినందున అర్థభేదం కలుగుతుంది. ఉదాహరణకు షష్ఠీ అంటే ఆరవ విభక్తి, ఆరవతిథి, పార్వతి (షష్ + డట్ + ఙీప్). కానీ షష్టి అంటే అరవై (అఋవది). షష్టితమ అంటే అరవైయవది. ఇలాగే

దారణము అంటే చీల్చుట, కానీ ధారణము అంటే ధరించుట

దామము అంటే దండ, కానీ ధామము అంటే ఇల్లు

చలము అంటే స్థిరము కానిది, కానీ ఛలము అంటే నెపము

వేదమయము అంటే వేదముతో నిండినది. కానీ వేధోమయము అంటే బ్రహ్మమయము. (వేదస్ = వేధ అంటే బ్రహ్మ)

శూరుడు అంటే శౌర్యం కలవాడు. సూరుడు అంటే సూర్యుడు. సూరి అంటే పండితుడు.

దార అంటే భార్య. ధార అంటే ప్రవాహము.

సభ్యులు (సభలో ఉండువారు, సభాసదులు, సభాస్తారులు) – సభికులు (జూదం ఆడేవారు)

సమజము (పశువుల మంద) – సమాజము (మనుష్యుల సమూహము)

కొన్ని శబ్దాలకు రెండు రూపాలు ఉంటాయి. ద్విరూపకోశము నుండి ఇలాంటి పదాలను గ్రహించవచ్చు. ఉదాహరణకు

నిటలేక్షణుడు = నిటాలేక్షణుడు (శివుడు)

మార్తండుడు = మార్తాండుడు (సూర్యుడు)

భూమిపతి = భూమీపతి (రాజు)

మహిపతి = మహీపతి (మహిపాలుడు = మహీపాలుడు)

రాత్రిమణి = రాత్రీమణి (చంద్రుడు)

వేణిసంహారము = వేణీసంహారము

యువతిమణి = యువతీమణి

వీచిధ్వని = వీచీధ్వని

కేలిగృహము = కేలీగృహము

హనుమంతుడు = హనూమంతుడు

దిక్ + అంత = దిగంత లేదా దిశా + అంత = దిశాంత (దిక్పతి, దిశాంపతి)

సంపత్తు = సంపత్తి

కోషము = కోశము

మూషకము = మూషికము

కొన్నిచోట్ల బహుళగ్రహణం వల్ల ఉపసర్గకు రెండురూపాలు వస్తాయి (ఉపసర్గస్య ఘఞ్యమనుష్యే బహులం –అష్టా.6.3.122)

పరిహారము – పరీహారము

పరిపాకము – పరీపాకము

పరిరంభము – పరీరంభము

ప్రతికారము – ప్రతీకారము

పరిహాసము – పరీహాసము

పరివారము – పరీవారము

పరిభవము – పరీభవము

కొన్ని అసాధు శబ్దాలు, వ్యుత్పత్తి లేని శబ్దాలు ప్రయోగాల వల్ల వాడుకలో నిలబడతాయి.

వాక్ + గ్మి = వాగ్మి (అసాధు రూపమైన వాగ్మి కూడా వాడుకలో ఉంది)

అపూర్వము (వ్యుత్పత్తి లేని అపురూపము ప్రయోగాలలో ఉంది)

ఐశాని (అసాధు రూపమైన ఈశాన్యం కూడా వాడుకలో ఉంది)

కోమల (అసాధు రూపమైన కోమలి కూడా దేశ్యపదంగా వాడుకలో ఉంది)

మరికొన్ని అసాధు రూపాలు

సాహాయ్యకుడు (అసాధువు) – సహాయకుడు (సాధువు)

సామ్రాట్టు (అసాధువు) – సమ్రాట్టు (సాధువు)

అభ్యంగనం (అసాధువు) -- అభ్యంజనం (సాధువు)

అయిష్టం (అసాధువు) – అనిష్టం (సాధువు)

ఆపేక్ష (అసాధువు) – అపేక్ష (సాధువు) – కానీ ఆపేక్షిక రూపం సరియే

ఉధృతము (అసాధువు) – ఉద్ధృతము (సాధువు)

వంశావళి (అసాధువు) – వంశ్యావళి (సాధువు)

ఇవీ కొన్ని సాధుప్రయోగాల విశేషాలు.

## తటిల్లతలు

'మహాసహస్రావధాని' గరికిపాటి నరసింహారావు గారి అవధానముల నుండి..

**ప్రశ్న :** అర్ధనారీశ్వరుని జనాభాలెక్కలలో మగవారిలో వెయ్యాలా? ఆడువారిలో వెయ్యాలా?

**సమా :** అసలు తీసేయడం మంచిది. ఒకవేళ వేయాల్సి వస్తే 'ఫీమేల్' అని వ్రాయండి. అందులో 'మేల్' ఉంటుంది కదా!

**ప్రశ్న :** పెళ్ళయితే ఊటీ వెళ్తారు.. మరి షష్టిపూర్తికి..

**సమా :** బ్యూటీపార్లర్‌కి వెళతారు... జుట్టుకు రంగు వేసుకోవడానికి!

అవధాని ఏకాక్షర నిఘంటువును కంఠగతం చేసుకుని, ఉచితానుచితాలను గుర్తెరిగి ప్రయోగించాలి. అలా ప్రయోగించాలంటే వ్యాకరణ శాస్త్రము, కావ్యశాస్త్రం మొదలగు వాటితో పరిచయం మాత్రమే కాదు పాండిత్యం కూడా ఉండాలి. దీనికి ఒక తేలికమార్గం ఉన్నది. అది పూర్వ అవధానుల ప్రయోగాలను తెలుసుకొని ఆ మార్గంలో వెళ్ళడం. అయితే అది వారిని అనుకరించడం కాదు, శబ్దసంప్రదాయాన్ని అనుసరించడమే అవుతుంది. నిజానికి అన్ని ఏకాక్షరాలు అవధానికి అవసరం కావు. అందువల్ల కొన్ని ప్రసిద్ధమైన వాటిని తెలుసుకొన్నా నిషిద్ధాక్షరి నిర్వహణలో లాఘవం కలుగుతుంది. అటువంటి వాటిని కొన్నింటిని చూద్దాం.

శ్రీకారం శుభమునకు కాక లక్ష్మి, అలంకారము, శోభ, సాలెపురుగు(శ్రీకాళహస్తి) విషము(శ్రీకంఠుడు), మారేడు చెట్టు(శ్రీశైలం) మొదలగు ప్రసిద్ధ అర్థాలలోనే, అప్రసిద్ధంగా సరస్వతి, పార్వతి, బుద్ధి అనే అర్థాలలో ఉన్నది. శ్రీకారం తర్వా 'ప' కాని 'శ' కాని చేర్చడం వల్ల విష్ణువు అనే అర్థాన్ని సాధించవచ్చు. శ్రీప తర్వాత ప్రాశ్నికుడు త కారం నిషేధం చేయకపోతే 'తి' కూడా కలిపి గణాన్ని పూర్తి చేయవచ్చు లేదా శ్రీ శ లో శను దీర్ఘం చేస్తే సంబుద్ధిగా మారి గణం పూర్తి అవుతుంది. శ్రీకారమే నిషేధం అయితే భూప కూడా అక్కరకు వస్తుంది. భూప అంటే రాజు, విష్ణువు అని అర్థాలు. భూమికి కు, జ్యా, క్ష్మా అన్నవి ఏకాక్షర పదాలు. వీటికి కూడా ప చేర్చి ఆ అర్థాలను సాధించవచ్చు. జ అన్న ఏకాక్షరానికి జప, జయ, ధ్వని, మేరువు, గంగ, నీరు, నగ, భార్య, యోని, సముద్రతీరం, దేవసేన మొదలగు అర్థాలున్నా 'పుట్టుట' అనే అర్థంలో దీనిని విస్తృతంగా ప్రయోగిస్తారు. భూమి నుండి పుట్టినది అన్న వ్యుత్పత్తితో చెట్టు, సీత సాధించబడుచుండగా భూజ, కుజ, జ్యాజ, క్ష్మాజ అన్నవి సీతకు, చెట్టుకు పర్యాయపదాలగును. ఇలా విస్తరికుట్టినట్లు అర్థవంతమైన పదములతో పద్యాన్ని అల్లుకోవాలి. ఔ అన్న ఏకాక్షరాన్ని కుమారస్వామి, నిర్మలాంగము, చంద్రకళ మొదలగు అర్థములలో కాక అది అవ్యయమైనపుడు ఆహ్వాన, నిరోధ, నిశ్చచార్థాలలో కూడా ప్రయోగించవచ్చును. దీనిని సి.వి. సుబ్బన్నగారు ద్రోణాచలం అవధానంలో 'ఔశుక్లభా' అని ప్రయోగించిరి. ఔ=వెన్నెల, శుక్ల=తెల్లని, భా=కాంతి వెరసి 'తెల్లని వెన్నెలకాంతి' అని అర్థం.




ద అన్న ఏకాక్షరానికి దాత, భేదించుట, ఓర్పు, పానము, వైరాగ్యము, భార్య, శివుడు, శుచి, గురుడు, చూపు, మూగ మొదలగు అర్థములుండగా ఇచ్చువాడు అన్న అర్థంలో ఎక్కువగా ప్రయోగాలు కనిపిస్తుంటాయి. శ్రీదా=సంపదలిచ్చువాడు, ధీదా=బుద్ధినిచ్చువాడు ఇత్యాది విశేషణాలు ఏ దేవుని వర్ణనకైనా ఉపకరిస్తాయి. శ్రీ, ధీలు రెండూ ఈ కారాంతములు కనుక ఈట్, ఈశ, ఇద్ధ, ఇష్టి, ఇచ్ఛ మొదలగు వాటితో సంధిచేస్తే అవధానికి నిషేధాన్ని దాటే అవకాశాలు మెండుగా ఉంటాయి. 'ఆప్' అనగా నీరు దానికి ద చేరిస్తే మేఘమవుతుంది. ధి చేరిస్తే సముద్రమవుతుంది. సి.వి.సుబ్బన్నగారు దదదబ్ద సూచ్ఛతయు, రాస్పదాబ్ధ్యధః ప్రస్థతాదశయు అని నిషిద్ధాక్షరి పద్యం చెప్పారు. దదత్=ఇచ్చు గుణం గల(దాతయైన) అబ్ద=మేఘము యొక్క సు+ఉచ్ఛత = అత్యున్నతస్థితి, అదే విధంగా రా = సంపదకు, ఆస్పద = నిలయమైన, అబ్ధి = సముద్రము యొక్క, అధః ప్రస్థతాదశ = నీచస్థితి అని అర్థాలు. వీటిలో ఆస్పద పదంలో ద రెండవపాదం ప్రాసాక్షరం. రెండవపాదంలో ప్రాసాక్షర నిషేధం ఉండదు కనుక మొదటి అక్షరం స్ప చెప్పి ఉంటారు. రా, రై, రూ, రో లకు బంగారం, ధనం అన్న అర్థాలున్నాయి.

శ్రీ సుబ్బన్నగారు శివుణ్ణి గూర్చి పద్యం చెబుతూ 'ఉగతస్వాంత' అన్నారు. ఉ అంటే విష్ణువు, విష్ణువును హృదయమునందు గలవాడని అర్థం. 'శివస్య హృదయం విష్ణుః' కదా! 'భా' అన్న అక్షరానికి కాంతి, ఆకాశము, నక్షత్రము మొదలగు అర్థాలున్నవి. సుబ్బన్నగారు చంద్రుడనడానికి భేశ (నక్షత్రములకు రాజు, ఉడుపతి) అని ప్రయోగించారు. అదే విధంగా గ్లౌ అన్నా చంద్రుడే, గ్లౌభా, గ్లౌశ్రీ అన్న పదాలు వెన్నెలను సూచిస్తాయి. ట అంటే కాకి, ధ్వని, భూమి, పొగ, విల్లు అన్న అర్థాలున్నవి. టాజ అంటే వృక్షము. సుబ్బన్నగారు సుధాభుక్టాజ అని కల్పవృక్షాన్ని పేర్కొన్నారు. వారే రాజశ్రేష్ఠుడు అనడానికి క్వీణ్ణాగు అన్నారు. కు అంటే భూమి, ఈట్ అనగా శాసించువాడు నాగశబ్దం శ్రేష్ఠతావాచకం. మరొక చోట రాజును జ్యేశ అన్నారు. జ్యా+ఈశ అన్నమాట. అదే విధంగా టేట్ అని కూడా అన్నారు. సూర్యుని ఖగేట్ అన్నారు. ఖేట్ అన్నా సరిపోతుంది. రజ్యా అని ప్రయోగించి ర = మన్మథుడు, జ్యా = వింటినారి అని అర్థసాధన చేశారు. ఇటువంటి ప్రయోగాలను తెలుసుకోవడానికి డా॥ సి.వి. సుబ్బన్న శతావధానిగారి అవధానాలు సంపుటమైన శతావధాన ప్రబంధము - త్రిపుటిని అవధానములు చేయగోరువారు - అధ్యయనం చేయాలి. **(సశేషం)**




పూర్వకాలంలో తెలుగులో పదాలలో అరసున్న వినియోగం ఉండేది.(సిద్ధఖండ బిందువు) తెలుగువర్ణమాలలో కూడ అరసున్న ఉండడం మనం చూడవచ్చు. అయితే అది ఇప్పుడు వినియోగంలో లేదు. ఈ సిద్ధ ఖండాబిందువులు(అరసున్న) ఎక్కడెక్కడ ఉంటాయో తెలపడానికి ప్రత్యేక విధి విధానాలు లేవు.

చిన్నయసూరి తన సంజ్ఞా పరిచ్ఛేదంలో (సూ 14) తెలుగుపదాలలో హ్రస్వాక్షరం తరువాత సిద్ధంగా ఉన్న అరసున్న స్థానంలో నిండుసున్న వికల్పంగా వస్తుందని చెప్పారు.

**ఉదాహరణలు:**

అదఁకువ అనే పదంలో ద పిదప ఉన్న అరసున్న నిండు సున్నగా మారి అదంకువ అని అవుతుంది.

అరఁటి అనే పదంలో ర పిదప ఉన్న అరసున్న నిండుసున్నగా మారి అరంటి అని రూపం సిద్ధిస్తుంది.

ఇది వికల్ప సూత్రం కనుక రెండు రూపాలు ఉంటాయి.

ఇలాగే ఇతర ఉదాహరణలు గ్రహించాలి.

సంజ్ఞాపరిచ్ఛేదం 15 వ సూత్రం **'దీర్ఘము మీద సాధ్యపూర్ణము లేదు.'** అని.

బిందువు రెండువిధాలు. **1.సిద్ధము 2.సాధ్యము.** అని.

స్వతఃసిద్ధంగా పదంలో ఉన్న సున్న **సిద్ధము.**

వ్యాకరణసూత్రాల ద్వారా ఏర్పడిన సున్న **సాధ్యము.**

వ్యాకరణ సూత్రాలద్వారా ఏర్పడే నిండుసున్న దీర్ఘాక్షరాల తరువాత ఉండదు. అని.. ఇది ముందుముందు కీలకంగా ఉపయోగపడే సూత్రం.

తెలుగుభాష పరంగా చిన్నయసూరి ఒక ముఖ్య విషయాన్ని 16 వ సూత్రంలో చెప్పారు.

**'సంస్కృతసమేతరములయిన తెలుగు శబ్దములయందుఁ బరుషసరళంబులకు ముందే బిందువు కానంబడుచున్నది.'**

సంస్కృత సమ ఇతరాలు అంటే తద్భవాలు. దేశ్యాలు. తద్భవాలకు కూడా అచ్చతెలుగు పదాలుగానే పరిగణన. తెలుగుపదాలలో బిందువు (అరసున్న, నిండుసున్న) పరుష, సరళాలకు ముందే ఉంటుంది.

వంకర, మంచు, కొంత, దుంప, కొంప ఇలాటి పదాలలో పూర్ణబిందువు పరుషాలకు ముందే చూడవచ్చు.

కలఁకువ, త్రాఁచు మొదలైన చోట్ల ఖండబిందువు పరుషాలకు ముందే ఉంది.

దొంగ, దండ మొదలైన పదాలలో సరళాలకు ముందే నిండుసున్న ఉండగా, రేఁగు, గోఁగు మొదలైన నుడులలో అరసున్న సరళాలకు ముందే ఉండడాన్ని గమనించవచ్చు.

సంజ్ఞా సూత్రం 17

**'యకారంబును, వుపూవొవో లు తెలుగు మాటలకు మొదట లేవు.'** అని.

యకారం, వు, వూ, వొ, వో అనే 5 అక్షరాలు తెలుగు మాటలకు మొదటి అక్షరాలుగా ఎక్కడా ఉండవు.

**'వోలె'** అనే పదం ఒకటి దీనికి భిన్నంగా కనిపిస్తున్నది.

ప్రాంతీయంగా ఉన్న పలుకుబడిలో అచ్చులతో మొదలయ్యే కొన్ని పదాలను **'య'**గా, అలాగే **'వ'**కార స్పర్శతో పలకడం కొన్ని చోట్ల వింటూ ఉంటాము. అది ఆయా ప్రాంతాల పలుకుబడిగా మాత్రమే తీసుకోవాలి..

**యారు**(ఎవరు) మొదలైనవి.

అలాగే పలకడంలో ఉచ్చారణాసౌలభ్యం కొరకు **వూరు, వున్న** వలె తేల్చి పలుకుతున్నా అసలు పదాలు మాత్రం **ఊరు, ఉన్న** మొదలైన విధంగా గ్రహించాలి.

**'హరియతడు'** అన్నప్పుడు అక్కడి **య** సంధిగతంగా వచ్చిన **య**.

హరి+అతడు అనే రెండు పదాలు కలపాలి అనుకున్నప్పుడు సంధి రాదు కనుక యడాగమం వచ్చి, హరియతడు అవుతుంది. అంతేకానీ యతడు అనేది పదం కాదు.

అలాగే **'నిద్ర+పోయె'** అనే పదాలు కలిసినప్పుడు గసడదవాదేశం సూత్రం ప్రకారం **ప** కారం **వ** కారంగా మారి నిద్రవోయె అని అవుతుంది. అంతేకానీ అక్కడ అసలు పదం **వోయె** కాదు.

కొన్ని ప్రాంతాలలో **పోయాడు**(వెళ్ళాడు అనే అర్థంలో)ను **'వోయిండు'**గా వ్యవహరించడం మనం వింటూ ఉంటాం. అలాటివి ప్రాంతీయంగా నిత్య వ్యవహారంలో పలుకుబడిలో ఉన్నాయి అని గ్రహించాలి.

**(సశేషం)**

# కావ్యదోషాలు

డా॥ సూరం శ్రీనివాసులు




## అనర్థకం:

వామనుడు చెప్పిన పదదోషాలలో చివరిది **అనర్థకం. 'పూరణార్థ మనర్థకమ్'** అని అనర్థక దోషలక్షణం. పూరణమంటే అపేక్షిత – గణాలతో పాదపూరణం. పద్యమైనా, గద్యమైనా రచనా లక్ష్యం తాననుకొన్న భావాన్ని లేదా ఆలోచనను ఇతరులతో పంచుకోవటం, లేదా ఇతరులకు తెలియజేయటం. గద్యంలో అయితే మన భావాన్ని యథాతథంగా మన అనుకొన్న భాషలోనే, మనకు నచ్చిన పదాలతోనే వ్యక్తం చేయవచ్చు. పద్యవిషయంలో అయితే మన ఆలోచనను ఇతరుల నిర్మాణంలో చొప్పించగలగాలి. దాని కోసం పదాలు మార్చవలసి వస్తుంది. వ్యక్తీకరణను మార్చవలసి వస్తుంది. ఒక్కొక్కసారి భావాన్నే మార్చి వేస్తాం కూడా. ఒక ఉదాహరణ చూద్దాం –

ఆకాశంలో ఒక తారా
నాకోస మొచ్చింది ఈ వేళా... (ఒక గీతం)

దీన్ని పద్యంలో పెట్టాలంటే 'ఆకాశంలో' – మందాక్రాంతతో మొదలుపెట్టవచ్చు. అయితే 'ఒక తారా'తో మందాక్రాంతను కొనసాగించలేం. లేదా కందంతో మొదలు పెట్టవచ్చు.

ఆకాశంలో ఒక తా
రా... నా

కందం మొదటిపాదం వరకు కుదిరింది. రెండవపాదం దగ్గరకు వస్తే ప్రాస కుదరలేదు. కాబట్టి అప్పుడు అనివార్యంగా పదాన్నో, అసలు వృత్తాన్నో మార్చుకోవలసి వస్తుంది. అందుకే అత్యాధునికంగా కవులు క్రొత్త క్రొత్త వృత్తాలను (లెక్కలోనివే కానీ ఊరూ పేరు లేనివి) ఆవిష్కరిస్తున్నారు. తామే ఓం ప్రథమంగా నామకరణం చేసి. ఇంతింత దూరం వెళ్ళకుండా అక్కడికక్కడే భావాన్నీ, పద్యాన్నీ సరిపెట్టాలంటే కొన్ని అవసరం లేని పదాలు పడుతుంటాయి. సంస్కృతంలో 'తుహిచస్మవై పాదపూరణౌ' అని నిర్దేశించుకుని తు, హి, చ, స్మ, వై వీటిని పాద పూరణాలుగా అంగీకరించారు.

ఆంధ్రసాహిత్యంలో కూడా పురాణార్థక పదాలలో భూమి, తత్పర్యాయ పదాలకు గిరాకీ ఎక్కువగా వుంటుంది. యతిప్రాసల నియమాన్ని అనుసరించటంలో, అందునా మకుట నియమం గల వాటిలో ఈ అవసరం ఎక్కువగా వుంటుంది. సుమతి శతకంలో దీని విశ్వరూపాన్ని చూస్తాం.

అక్కఱకు రాని చుట్టము
మ్రొక్కిన వరమీని వేల్పు మోహరమునఁ దా
నెక్కినఁ బాఱని గుఱ్ఱము
గ్రక్కున విడువంగవలయు గదరా సుమతీ!

లావుగలవానికంటెను
భావింపఁగ నీతిపరుఁడు బలవంతుండే
గ్రావంబంత గజంబును
మావటి వాడెక్కినట్లు మహిలో సుమతీ

ఈ భూపర్యాయ పదాలతో పాటు నిశ్చయార్థక పదాలను సైతం వాడకం సుమతీ శతకంలో ఎక్కువే.

"ధర తగ్గుట హెచ్చు కొఱకె తథ్యము సుమతీ!"
"చీటికి ప్రాణంబు వ్రాలు సిద్ధము సుమతీ!"
"నేరములే తోఁచుచుండు నిక్కము సుమతీ!"
"వెంగలితో చెలిమి వలదు వినరా సుమతీ!"

ఆషామాషీ కాదే
భాషావ్యవసాయము ధర, బాసటవయి సం
తోషమునిడి మాకవులకుఁ
బోషణనిచ్చెదవు కానఁ బొగడెదమే 'టీ' (టీ శతకం – విట్టుబాబు)

ఇప్పటికీ ఈ భూమి ఇలా 'నిశ్చలంగా' తిరుగుతూనే వుంది.

వీటితో పాటు **కనగా, తెలియగా** వంటి లోకేక్షణను ప్రకటించే పదాలు కూడా తెలుగులో ఎక్కువగా వినియోగంలో వుంటాయి. మహాకవుల పద్యాలలోనే –

ఆరయ నెందును గౌరవ
భారం బెడలంగనీక పాతివ్రత్యా
చారముపై వర్తింతురు
సైరంధ్రీజాతివారు సౌజన్యమునన్

– విరాటపర్వం: 1/112

మన శాస్త్రాస్త్రంబులు ద
క్కిన యవి యొకభంగి వీటికిని గాండివముం
గొను పోయితి మేని సుయో
ధనునకు నగపాటు నిశ్చితం బూహింపన్

– విరాటపర్వం: 1/158

మును బకుననుజుని వలనం
దన తమ్ములు దాను బ్రతుకఁదలఁచి యతఁడు స
చ్చిన విభుఁడు భీమసేను ప్ర
తిన పారం బెయ్యునని మదిందలంచె నృపా!

– ద్రోణపర్వం: 5/224

ఇవన్నీ మహాకవి తిక్కన ప్రయోగాలే. ఆరయన్(చూడగా), ఊహింపన్, మదిన్ - ఇవి లేకపోయినా భావనగమనంలో వచ్చే మార్పేమీ లేదు. కానీ అవి మూడు చోట్ల మూడు రకాలుగా ఉపయోగపడ్డాయి. మొదటిది ఎత్తుగడ కోసం. రెండవది భావసంపూర్ణీకృతి కోసం. మూడవది యతి కోసం. పదిహేను పర్వాల భారతంలో ఇలాంటివి అక్కడక్కడ తగులుతాయి.

ఇన్ని దినంబులున్ సవతులిందఱిలో నల సత్యభామకున్
సన్నలఁ ద్రిమ్మరున్ హరివశంవదుఁడై యన విందుఁ గాని యో
కన్నియ! నీ యెడం గలుగు గారవమెయ్యడఁ జూచి కాన లే
కున్న ననర్ఘ్యదివ్యకుసుమోత్తమ మేరికినైన నిచ్చెనే

పారిజాతాపహరణము: 1/65

మహి మున్ వాగనుశాసనుండు సృజియింపం గుండలీంద్రుండు ద
న్మహనీయస్థితిమూలమై నిలువ శ్రీనాథుండు ప్రోవ న్మహా
మహులై సోముఁడు భాస్కరుఁడు వెలయింపన్ సొంపు వాటించు నీ
బహుళాంధ్రోక్తిమయప్రపంచమునఁ దత్ప్రాగల్భ్య మూహించెదన్

వసుచరిత్ర: 1/10

అక్కడ తిమ్మన **అల**, ఇక్కడ భట్టుమూర్తి **మహి** రెండూ అనర్థకాలే. మొదటిది గణపూరణ రెండవది ఎత్తుగడ. ఇటువంటి వాటిలో కొన్ని వాక్యాలంకారాలుగా కూడా ఆ బేధాన్ని గమనించగలగాలి.

అనర్థకంగా సాహిత్యంలో విరివిగా వినియోగింపబడే అవ్యయాలు రెండు. ఒకటి సముచ్చయార్థకం, రెండు అవధారణార్థకం. ప్రాచీన సాహిత్యంలో కూడా అక్కడక్కడ ఇటువంటి దోషం కనిపిస్తున్నా ఆధునిక పద్యాలలో విశృంఖలంగా కనిపించే దోషస్వరూప మిది.

"చరిత సృష్టించెనో సాహితీరంగాన
నయ్యసాధ్యుడు నౌర యాంధ్రినెవరు?
.....
విశ్వనాథ వంశీయుడే వేరునెవరు?"

- రాయప్రోలు జగదీశ్చంద్రశర్మ

అసాధ్యుడును, వేరును ఈ రెండు చోట్ల సముచ్చయ ప్రయోగం అనర్థకమే కాదు నిరర్థకం గూడా.

"పారమార్థిక విద్యతో మరి పారమొందును జన్మమే"

- కొరిడె విశ్వనాథశర్మ(31-10-25)

ఇక్కడ మరి పూర్ణంగా పురాణార్థకం. వ్యవహారంలో ఈ మరులు మరీమరీ వినిపిస్తుంటాయి. కానీ పద్యాలలో వాటికి (దానికి) అవకాశం లేదు. మాటలకు దగ్గరగా పద్యాన్ని తీసుకొని వచ్చే ప్రయత్నమైతే దానిని అభినందించవచ్చు. కానీ గణతృప్తి కోసమే ఆ ప్రయోగం.

కర్ణుండును దానమును చేసి కవచకుండ
లములను చివరకును కూలె రణమునందు
సాయమును చేయగ ధరణి శాపమిచ్చె
దాన మొనరింపగల్గు బాధలు గడింది

- పిరాట్ల జయలక్ష్మి

ఇక్కడ సముచ్చయార్థకాలైన కర్ణుడు-ను, చివరకు-ను పూర్తిగా అనర్థకాలు. ఎందుకంటే కవచకుండలాలను దానం చేసింది కర్ణుడు ఒక్కడే. కర్ణుడును అనటంతో మరొకరు అలా దానం చేసినట్టూ, ఆ వ్యక్తితో పాటు కర్ణుడు దానం చేసినట్టూ అర్థం వస్తుంది. చెప్పదలచుకొన్నది అది కాదు గదా!

"నారికేళములోన నారమే నింపుతూ
చిప్పను మెప్పెను గప్పి జూచి" - శిరీష (15-10-25)

'నారమే' అని అవధారణార్థక ప్రత్యయ ప్రయోగం పూరణ మాత్ర ప్రయోజనకం. అనర్థకం. ఈ పాదంలోనే నింపుతూ అని వ్యవహారిక పదం (నింపుచున్ - వ్యాకరణ సమ్మతం), గప్పిజూచి అని సరళాదేశంతో ప్రయోగం కూడా దోషాలే. ఇటువంటిదే వీరి మరో ప్రయోగం అనర్థకమైన అవధారణార్థక మైన దిది -

"పొలిచె నగస్త్య తారక ప్రఫుల్లములయ్యె జలాశయమ్ములే"

(28.09.25)

పదాంతరంతో గమ్యమానమయ్యే అర్థాన్ని మరలా వాచ్యం చేస్తూ చెప్పటం కూడా అనర్థకమే అవుతుంది. అది స్వతాహాగా అర్థవంతమనిపిస్తున్నా ఆ పదం లేకపోయినా అన్యపదాల వల్ల ఆ పదం అప్రయత్నంగానే సిద్ధిస్తున్నప్పుడు అది పూరణమాత్ర ప్రయోజకమై అనర్థక దోషమవుతుంది.

"... వడలును పానకమ్ము వడపప్పును కాచిన నీటి యావిరిన్
ఉడికిన వ్రీహిచూర్ణమున నొప్పగు వంటకమున్..."

- సాంప్రతి సురేంద్రనాథ్, 12-9-25

ఇక్కడ కాచిన పదం అనర్థకం. ఎందుకంటే ఆవిరి అనేది కాచిన నీటినుండి వచ్చేదే కానీ చల్లని నీటి నుండి వచ్చేది కాదు. కాబట్టి ఆవిరి పదంలోనే త్రాగటమన్న క్రియార్థం కూడా ఉంటుంది. దానితో గతార్థమైన ఈ 'కాచిన' పదం వాచ్యమై అనర్థకమవుతోంది. ఈ కవీశ్వరునిదే మరో ప్రయోగం -

"రాసకేళీ పరిభ్రమణ విభ్రమ వేళ
చెదరిన ముంగురుల్ నుదుట నాడ" (20-11-25)

ఇది శ్రీకృష్ణ దర్శన సన్నివేశం. ముంగురులు నుదుట ఆడుతున్నాయని వర్ణన. నుదుట వ్రాలిన కురులనే ముంగురులు అంటారు. అలా కానివి కురులు మాత్రమే. నుదుట పదంతోనే అవి నుదుట వ్రాలటం గతార్థమైంది. కాబట్టి అక్కడ

## ప్రహేళికా

హనుమంతుని చేతిలో రాముడు హతమయ్యాడు.

ఈ శ్లోకం చాలా ఆసక్తికరంగా ఉంది! ఇది సంస్కృత భాష లోని శ్లేషాలంకారానికి (ఒకే పదానికి రెండు అర్థాలు ఉండటం) ఒక అద్భుతమైన ఉదాహరణ. పైకి విపరీతంగా అనిపించినా, లోతుగా చూస్తే అసలు సత్యం బోధపడేలా ఈ శ్లోకాన్ని రూపొందించారు.

**శ్లోకం**

**హతో హనుమతారామః సీతా సా హర్ష నిర్భరా ।**
**రుదంతి రాక్షసా స్సర్వే హాహారామో హతోహతః ॥**

**తాత్పర్యము**

**పైకి కనిపించే విపరీతార్థం:**

"హనుమంతుని చేతిలో రాముడు హతమయ్యాడు. అది చూసి సీతమ్మ సంతోషించింది. రాక్షసులందరూ రాముడు చనిపోయాడని ఏడుస్తున్నారు." (ఇది రామాయణ గాథకు పూర్తిగా విరుద్ధం).

**నిజమైన అర్థం:**

హనుమంతుడు అశోకవనాన్ని (ఆరామః) ధ్వంసం చేశాడు (హతః). ఆ వార్త విని సీతాదేవి "తనను రక్షించే వీరుడు వచ్చాడని" ఎంతో సంతోషించింది. తమకు ఎంతో ఇష్టమైన తోట పాడైపోయిందని రాక్షసులందరూ "హా! మా ఆరామం (తోట) నాశనమైపోయింది" అని విలపించారు.

**విశేషము**

ఈ శ్లోకంలో అసలు రహస్యం "హనుమతారామః" అనే పదంలో ఉంది. దీనిని రెండు రకాలుగా విడదీయవచ్చు:

హనుమతా + రామః: అంటే హనుమంతుని చేత రాముడు (చంపబడ్డాడు). ఇది తప్పు అర్థం.

హనుమతా + ఆరామః: సంస్కృతంలో 'ఆరామము' అంటే వనం లేదా తోట. అంటే హనుమంతుని చేత వనం ధ్వంసం చేయబడింది. ఇది సరైన అర్థం.

**ముఖ్య అంశాలు:**

**సీతమ్మ సంతోషం:** రాముడు చనిపోతే సీతమ్మ సంతోషించదు కదా! కానీ తన భర్త పంపిన దూత వచ్చి రాక్షసుల గర్వాన్ని అణిచివేస్తూ వనాన్ని ధ్వంసం చేస్తుంటే, ఆమెకు ఆశ చిగురించి సంతోషం కలిగింది.

**రాక్షసుల రోదన:** రాముడు చనిపోతే రాక్షసులు పండగ చేసుకుంటారు కానీ ఏడవరు. ఇక్కడ వారు ఏడుస్తున్నది రాముడి కోసం కాదు, వారు ప్రాణప్రదంగా పెంచుకున్న అశోకవనం (ఆరామం) నాశనమైనందుకు.

**గమనిక:** సంస్కృత సాహిత్యంలో ఇలాంటి చమత్కార శ్లోకాలు బుద్ధికి పదును పెడతాయి. పదాలను విడదీసే విధానాన్ని బట్టి అర్థం ఎలా మారుతుందో ఇది నిరూపిస్తుంది.

**- ఆచార్య తాడేపల్లి పతంజలి**

---

పూర్వకాలంలో ఏకొంచెం సంస్కృత పాండిత్యం గలిగిన కవులు, పండితులు ఏదైనా కార్యక్రమాలకు వెళితే సభలలో ఆశీర్వచన శ్లోకాలు రచించినవో, లేక ప్రాచీనమైనవో చెప్పి సభను రంజింప జేసేవారు. అలాంటి శ్లోకాలలో రెండర్థములు, మూడర్థములు కలిగినవి ఉండేవి. అలాంటి శ్లోకం ఇపుడు మనం చూద్దాం.

శ్లో॥ పాతువో గిరిజామాతా యస్య ద్వాదశలోచనః ।
తథైవ గిరిజామాతా ద్వాదశార్ధార్ధలోచనః ॥

అంటే ఒక అర్థం కుమారస్వామి (షణ్ముఖుని గురించి, మరొక అర్థం ఈశ్వరుని గురించి.

యస్య = ఎవరికైతే; ద్వాదశలోచనః = పన్నెండు నేత్రములు గలిగినవాడు (ఆరు ముంఖములుంటే 12 నేత్రాలుంటాయి కదా!); గిరిజా-మాతా = పార్వతీదేవిని తల్లిగా కలిగినవాడు; వః = మిమ్ములను; పాతు = రక్షించుగాక; తథైవ = అట్లే; గిరి-జామాతా = పర్వత రాజు హిమవంతుని అల్లుడు; ద్వాదశార్ధార్ధ లోచనః = పన్నెండులో సగం-ఆరు, ఆరులో సగం - మూడు నేత్రములు గలిగినవాడు; శివుడు; పాతు = రక్షించు గాక!

ఇలా ఒక శ్లోకపాదంలో షణ్ముఖుని, ద్వితీయపాదంలో పరమేశ్వరుని స్తుతించి పదాలను, అర్థాలను, భావ మాధుర్యాన్ని అందించిన ఈ శ్లోకం ఇప్పటికీ కొన్ని ఆశీర్వచనాలుగా పెద్దలు చెప్తూచూ ఉన్నారు.

**- 'అష్టావధాని' ముత్యంపేట గౌరీశంకర శర్మ**

---

ముంగురులలో ముందు వరకు అనర్థకదోషజుష్టమైంది. అక్కడ కురులు అన్న ప్రయోగమే చాలు.

కవుల అజాగరూకతవల్ల గానీ, అతి జాగురూకత వల్ల కానీ ఇటువంటి ప్రయోగాలు కవిత్వంలో చోటు చేసుకుంటాయి. శారదాసమారాధన జీవితలక్ష్యమైనపుడు ప్రతిపదంలోనూ, సమతను కాపాడుకొంటూ ముందుకు సాగాలి. లేకపోతే నిరర్థకాలైన సముచ్చయార్థకాలు, అవధారణార్థకాలూ, గతార్థాలూ, పునరుక్తులూ, బలహీనమైన విశేషణాలూ, పద్యాలలో దొర్లుతాయి. ఒకసారి దొర్లితే దాన్ని సవరించుకోవటం చాలా కష్టం. అది బాగుపడకపోగా మిగిలిన పద్యాన్నీ పాడుచేస్తుంది. రచనను ఒక ధ్యానంగా, ఒక తపస్సుగా భావిద్దాం. నిరాగ్రహంగా ముందుకు సాగుదాం. **(సశేషం)**

# బమ్మెరపోతన భాగవతం-అలంకార సౌందర్యం

- వైద్యం వేంకటేశ్వరాచార్యులు

(గత సంచిక తరువాయి)

**వ.** దానవ సంగ్రామంబునుంబోలె నరిష్ట జంబ నికుంభ శక్తి యక్తంబై.

**అర్థం:** రాక్షసయుద్ధంలా–

1. అరిష్ట = అరిష్టుని, జంభ = జంభుని, నికుంభ = నికుంభుని, శక్తియుక్తంబై = శక్తులతో కూడుకున్నదై.

2. అరిష్ట = వేము, కుంకుడు, జంభ = నిమ్మ, నికుంభ = దంతిట్టు శక్తులతో.

**వ.** కౌరవ సంగరంబునుంబోలె ద్రో ణార్జునకాంచనస్యందన కదంబ సమేతంబై

**అర్థం:** కౌరవ(కురుక్షేత్ర) యుద్ధంలా–

1. ద్రోణ, అర్జున, కాంచనరథాల సమూహంతో కూడినదై.

2. ద్రోణ = తుమ్మిచెట్టు, అర్జున = ఏఱుమద్దిచెట్టు, కాంచన = సంపెంగ, స్యందన = తినాసవృక్ష, కదంబ = కడిమిచెట్టు మొదలైన వాటితో కూడుకున్నదై.

**వ.** కర్ణ కలహంబునుంబోలె మహోన్నత శల్య సహకా రంబై

**అర్థం:** కర్ణుని కయ్యంలా–

1. గొప్పవాడైన శల్యుని సహకారం కలిగినదై.

2. మహోన్నతశల్య = పెద్దమంగచెట్లూ, సహకారంబై = తియ్య మామిడిచెట్లూ కలదై.

**వ.** సముద్ర సేతుబంధనంబునుంబోలె నల నీల పన సా ద్యద్రి ప్రదీపోతంబై

**అర్థం:** రామసేతువులా–

1. నలుడు, నీలుడు, పనసుడు మొదలైనవారు తెచ్చిన కొండలచే ప్రకాశించేది.

2. నల = వట్టివేరు, నీల = నీలిచెట్టు, పనస = పనసచెట్టు, కొండలు మొదలైనవి ప్రకాశిస్తున్నదై.

**వ.** భర్గు భజనంబునుంబోలె నానాశోక లేఖా ఫలితంబై

**అర్థం:** 1. ఈశ్వరుని గురించి చేసే భజనలా –

అశోక = నాశన(దుఃఖ)రహితమైన, నానా = అనేక, లేఖాఫలితంబై = అక్షర ఫలాలు కలదై.

2. నానా అశోక.... = అనేక ఫలాలుగల అశోక వృక్షాల వరుసలు కలదై.

**వ.** మరుని కోదండంబునుంబోలె బున్నాగ శిలీముఖ భూషితంబై

**అర్థం:**

1. మన్మథుని విల్లువలె పున్నాగ పుష్పబాణాలు కలదై

2. చెఱకు,తుమ్మెదలతో ఉన్నదై.

భాగవతంలో శ్లేషాలంకారయుక్తమైన పద్యాలుకూడా పోతనగారు అక్కడక్కడా మెరుపులా హృద్యంగా దర్శింపజేసినారు. మచ్చునకు–

సీ. పున్నాగ! కానవే – పున్నాగ వందితు,
తిలకంబ! కానవే – తిలక నిటలు,
ఘనసార! కానవే – ఘనసార శోభితు,
బంధూక! కానవే – బంధు మిత్రు,
మన్మథ! కానవే – మన్మథాకారుని,
వంశంబ! కానవే – వంశధరుని,
చందన! కానవే – చందన శీతలు,
కుందంబ! కానవే – కుంద రదను,

తే. ఇంద్రభూజమ! కానవే – ఇంద్ర విభవు,
కువలవృక్షమ! కానవే – కువలయేశు,
ప్రియక పాదప! కానవే – ప్రియ విహారు,
అనుచు కృష్ణుని వెదకి రయ్యబ్జముఖులు.

–10పూ,1009

గోపకాంతలు వనంలో శ్రీకృష్ణుని వెదకుతూ ఆయా వృక్షాలను కృష్ణసంబంధితమైన పదాలతో సంబోధిస్తారు. ఇదీ ఈ పద్యంలోని హృద్యమైన చమత్కార శ్లేష.

పున్నాగశబ్దానికి పున్నాగవృక్షమనీ,పురుష పుంగవుడనీ వేరు వేరు అర్థాలు ఉన్నాయి. అలాగే తిలక, ఘనసార, బంధూక, మన్మథ, వంశ, చందన, కుంద, ఇంద్ర, కువల, ప్రియక అనే పదాలు ఆయా వృక్షాలకుగల పేర్లు. వరుసగా ఫాలతిలకం, పరాక్రమం, సద్బంధుడు, మన్మథాకారత్వం, వేణువు, గంధం, మొగ్గలవంటి దంతసౌందర్యం, ఇంద్రవైభవం, ధరాధినాథత్వం, ప్రియవిహారం – అనే విశేషణాలు వాటికిగల రెండవ అర్థాలు.

ఈ శ్లేష చేత శ్రీకృష్ణుని రూపగుణ లావణ్య విశేషాలను వర్ణిస్తూ ఆయా వృక్షాలను కృష్ణునికోసం ఆరా తీశారు గోపకాంతలు. ఇది గోపికలకు వృక్షాలతో గల సాహచర్యంతోపాటు, వారికి శ్రీకృష్ణునిపై గల ప్రేమనూ సువ్యక్తం చేస్తోంది. ఇదొక మధురానుభూతిని కలిగించే అందమైన శ్లేష. ఈ శ్లేషలో పోతన్న గారి ఈ పద్యకృతిలో హృద్యచమత్కృతి కన్పిస్తాయి.

# ఖండశర్కర

**నిర్వహణ: శతావధాని ఎం.వి. పట్వర్ధన్**
**అష్టావధాని చేపూరి శ్రీరామ్**

## ఈనెల అంశం: తుషార లాస్యం

**శిష్ట్లా వి ఎల్ ఎన్ శర్మ, హైదరాబాద్**

చం. నిరుపమ రమ్య మీ జగతి నిత్యమనోహరమై చెలంగుచున్
జరిగెడి కాలచక్ర ఋతు చంక్రమణమ్మున దోగులాడుచున్
బరిగొను నట్టి రూపముల ప్రాభవమై భువి సంచరింపగన్
విరిసె తుషార మాలికలు ప్రీతిని నిర్మలమై ప్రభాతమున్!

చ. తరువుల రాగహేలలను ధాత్రి యొసంగు విచిత్ర రోచులన్
హరువు రచించి సద్విమల హాస ప్రదీప్త విలాస తేజమై
సరసత జేరు నీ యవని సాంద్ర మనోజ్ఞ హిమప్రభాతముల్
కరములు సాచి పిల్వగను గానగనౌ నిట శీతకాలమున్!

తే. ఉదయ వేళల బిందువై యొదిగి మెఱసి
సప్తవర్ణాల లాస్యాల సౌరు నింపి
శాద్వల తలముపై నిల్చి చారిమమున
హిమము పూచెను నవకాంతి హేమమగుచు!

తే. చలికి పులకించి స్వరముల తళుకులీన
దొరలదటె గళమందు హిందోళ మపుడు
లేతయెండల నీ తావు స్ఫీతమలర
శీతకాల ప్రభాకృతుల్ చెంగలించు!

ఉ. పచ్చనిచేలపై విరియు వన్నెల ముత్తెములై రహించి ను
ల్వెచ్చని కాంతులీను తొలి వేకువ వేళ ననంత శోభతో
విచ్చిన దారులం దలరి ప్రీతిని నిల్చి వరించు వేదికన్
మెచ్చని వారలెవ్వరు సమీపము నందున గాంచ నీ కళన్!

**డా.రఘుపతి శాస్త్రుల, హైదరాబాద్**

శా. ఆ కుందేందు తుషార హార ధవళన్ హైమావతీ సన్నుతన్
లోకుల్ ప్రార్థన జేసినన్ కరుణ నాలోచింపగా జేయు నా
శ్రీ కారుణ్య విశేష సంపదల కల్మిం గూర్చు వాణిన్ సదా
సాకారమ్ముగ కొల్చుచుందు సుమతిన్ సంపత్ప్రభా రూపిణిన్

చం. చలిగిలి గింత లొక్క తరి చాతురి జూపుచు విస్తరింపగా
వలపు తలంపులంగనుచు వైభవమొప్పు యువాళి జంటలున్
విలవిల లాడు వృద్ధుల సువీక్షితమౌ గత సంభ్రమంబులీ
యిలను తుషారమందలరు హృద్యములైన మనోజ్ఞ సంపదల్

ఉ. ముత్తెములో యనంగ పరిపూర్ణములైన తుషార బిందువుల్
సత్తువ చాటు చుండగ ప్రసన్నములౌ పులకాంకురావళిన్
మత్తిలి యీ వసుంధరయు మౌనముగా తన శోభలొల్కు సం
పత్తుల వెల్లువన్ దనర భానుని భానువులం గనంగనౌ

ఉ. అంగనలం గనంగ నగు అందములైన గృహాల ముంగిటన్
ప్రాంగణముల్ ప్రతీకలుగ రమ్యమునైన తుషార సంతతిన్
చెంగట నిల్చి ముగ్గులను శీఘ్రగతిన్ రచియించు మొగ్గలా
భంగుల చూడ ముచ్చటగు బాల సవిత్రుని ల్గంత మిన్కులన్

ఉ. నింగిని ఉత్సవమ్ములను నేర్పున నొప్పెడు ష్ఢడి పంటలున్
పొంగిన అంతరంగముల హోఁడిమితో నలరారు భామినుల్
రంగుల చిందు ప్రాంగణములన్నిదిశల్ కను విందు సేయ నొ
ప్పంగన నిట్టి యీ ప్రకృతి వర్ణనఁ జిత్తము తన్మయమ్మగున్

**పెనుకొండ రామబ్రహ్మం బెంగుళూరు**

మ. వనముల్ గప్పగ శీతలంపు పరి యుద్భాసిల్లి పుష్యమ్మునన్
ఘన లాస్యమ్ముల్ దుషార హేల ధర సాక్షాత్కారముం జేయుచున్
దనరున్ నాట్యమయూరిఁ బోలు చర సంధానమ్ముతో సాగుచున్
మనమానంద విహార డోలికల సామ్రాజ్యమ్మునన్ దేలఁగన్

పం.చా. విరాజ మానమై తుషార బిందువుల్ సుశోభలన్
సరోజ పత్రమందు నొప్పు సంస్థితమ్మునై రహిన్
దరింతు రెల్లరుం బ్రభాత ధామమందు కాంచఁగన్
ధరించ ముత్యమట్లు రూప్నఁ దత్క్షణమ్ము నందునన్

మంజుభాషిణి అరయంగ శైత్యమున నటులావహించన్
నెరవై తుషారపరి, నిబిడీకృతంబై
వరలంగమంద గతిఁ బచరించు రీతిన్
ధర లాస్యరూప్నఁ గని తగు హోయి నింపున్

ఉ. దీటుగ నెండ వేడిమియు దీపిల నెల్లర్నఁ దల్లడిల్లఁగన్
నీటుగ క్షీణ మొందనటు నెమ్మదిఁ గాంతురు శీతలమ్ము ప
ర్యాటక కాలమై విరిసి రంజిలు చుండ్నఁ దుషార లాస్యముల్
బాటవ మొందఁ గాంచు ధృతి పర్వత సీమలయందు హెచ్చగన్

చం. వరలఁ దుషార మెక్కువగఁ బచ్చని చేలను శీతలమ్మునన్
బరఁగు ప్రభాత వేళ మృదు పల్లవ నర్తన మొప్పు రీతిగన్
విరిసి చరించు నెమ్మదిగ విచ్చిన పుష్పపు రేకు లందునన్
గరిమగ మంచు బిందువులఁ గాంచమె ముత్యపు కాంతులీనుచున్

**మంకుశ్రీను, కొప్పర్రు, ప.గో.జిల్లా**

తే. ప్రకృతి మంచుచీరనుగట్టి పరవశించు
నట్టి హేమంత వైభవమబ్జసూతి
కైన వర్ణింప శక్యంబె అవనియందు
రామణీయకమ్మిదెజనరంజకమిదె

తే. ఈతుషారవిహారంబునెంతయేని
సాగుచుండ మనోవీణ మ్రోగుకాదె
స్వచ్ఛధవళకాంతిచ్ఛటసరసరీతి
నవ్యభావన రేపువిన్నాణమలర

ఉ. బంతులు పూయునిప్పుడె శుభంకర వైఖరులగ్గలింపగన్
ఇంతులురంగవల్లులనదేపనిగావిరచింతురెల్లెడన్
చింతలుపోనడంచుకదజీయరు గానసుధాస్రవంతి సం
క్రాంతి రమాలలామకిది కాంతిని బెంచునవారితంబుగన్

తే. అవని ధరియించుమంచుముత్యాలదండ
ఆకులందున జేరి లాస్యంబు చేయు
తరుణి ముక్కెరవోలె ఉత్సాహమొసగు
గరికపైనిల్చియెన్నొ సంగతులు పలుకు

తే. ఈతుషారంపువిభవంబునెంచి శూలి
పత్ని హిమవంతు గారాలపట్టియగుచు
తనిసె శివుడుజామాతయై తనిసె మంచు
పల్లకీనెక్కె భూదేవి భాసురముగ

**డి.సి.నరసింహులు, మేడ్చల్.**

మ.కో. వెండి కొండయె జాలు వారుచు, వెండి రేకులు పృథ్వికిన్
నిండ గప్పుచు గాను కిచ్చుచు నేత్ర పర్వము జేయ, నీ?
రెండ కోసము సర్వ ప్రాణులు నింగి వంకకు జూడగన్
జండ భానుడు నిస్సహాయుడు సంధ్య వేళల నిప్పుడున్

మ.కో. బాట జాడలు గాన రాకిట బాట సారుల తిప్పలున్
దాట రాదయ యిండ్లు వాకిలి దంచి కుర్చెడి మంచుతో
మాటు వేసిన దొంగ తీరుగ మంచు దప్పటి గప్పుచున్
జేటు దెచ్చును వృద్ధ జీవికి శీత లమ్మును శత్రువై

మ.కో. కొండ కోనలు గాన రావక గోరు చోటున జంతువుల్
యుండ లేకను గాన యంతయు నూసు బోకను దిర్గుచున్
చండ వేగము తోడ నూర్లకు సాగి పోవును భీతితో
చెండ ద్రోలుచు గ్రామ వాసులు జేర నీయరు నూళ్ళలో

మ.కో. పంట చేలను పాద రసములు బార బోసిన చందమున్
కంటి చూపులు బారు నంతట ఖండ శర్కర వోలెనున్
మింటి వెన్నెల నేల పైనను మెద్ది నట్లును నుండగా
కంట జూడగ భాను డెంతయొ కందిపోవగ జూడమే?

సీ. పంట చేల పయిన బర్వత దరులందు
రజతాద్రి కరగుచు రాలు భంగి
హిమ శీక రంబులు తమ నెలవు మరచి
భువివెంట పరుగిడి పొరలి నట్లు
శరదిందు చంద్రికల్ ధరణిపై పవళించి
సేద దీరుచు హాయి జెలగు రీతి
సజ్జను మానస చందమా యనునట్లు
ప్రసరించు జలువను దిశల వరకు

తే. చలి పులికి వెరచి పనుల సక్రమముగ
జేయ లేకను దదుపరి జేతు మంచు
వాయి దాలను వేయుచు వణకు చుంద్రు
గష్ట మైనను హేమంత మిష్ట సఖియె!

**మాడుగుల మురళీధరశర్మ, కాళేశ్వరం/సిద్ధిపేట**

చం. పొరుగుననున్న రాజ్యములు పొల్పడికల్మషమత్తచిత్తులై!
చొరబడుధూర్తచింతనల దూరని,మౌన,కరాళనృత్యముల్!
కరచరణాంగకృత్యమణి కంకణకింకిణికాణుశోధనల్!
నరవకచూపుమోదితము నందెదుసంద్ర తుషారలాస్యముల్

ఉ. కొండలుమెండుచల్లదన కూడికగాహిమశైలశీతలిన్!
పండుగనేల?నిండుదన భాస్కరకాంతిప్రకంపనాధృతిన్!
అండగనిల్పుకుండములు నన్నియుకర్గుచుపారువేళలో!
చండప్రచండకాండములు చందునఖండ తుషారలాస్యముల్!

చం. ప్రమథగణాలమ్రోల;సమ రాంగణసీమనభారతావనిన్!
సుమములబోలుకాంతినవ శోభిత సుందరహారతారకల్!
క్రమగతివజ్రమౌచు;కలి కాలముమాయలజాలమౌయనిన్!
హిమనగహేమనాట్యము;మ హీపతిచేయు తుషారలాస్యమే!

చం. కలిమలినంపుభీకరము; గానిలవాయువునందునిండగన్!
కలుషితమౌచుప్రాణములcగాచెడునత్రజనీవిహీనతల్!
తొలగగయంత్రకృత్రిమపు దొంతరగావిరిcజల్లునీరముల్!
చిలుకుచుహస్తినాపురపు సీమనచేయు తుషారలాస్యముల్!

ఉ. పంటపొలమ్ములందుజల పంపులతోడుగనీటిసాగునన్!
కంటిని చక్ర సమ్మిళిత కౌముదిcబోలెడునీటివాడుకన్!
గుంటలు,కాల్వలేనివిధి గుంద్రనిcజల్లెడcజల్లువిస్తృతిన్!
మింటినితాకురీతినివి మిశ్రమ కేళి తుషారలాస్యముల్!

**తదుపరి అంశం**

**హాయి హాయిగా ఆమని సాగె**

పై అంశానికి 5 పద్యములను 9441039146
ఫోన్ నంబరుకు వాట్సప్ ద్వారా పంపగలరు
ఖండికలు పంపవలసిన ఆఖరు తేది
15 మార్చి 2026

# సంస్కృతం సంస్కృతి 6

నారుమంచి వేంకట అనంతకృష్ణ శర్మ

సంస్కృత భాషాధ్యయన విధానముల మౌలికాంశాలు ప్రస్తావించుకున్నాక ఇక అధ్యయనము చేసేందుకు ఉపయుక్తమైన అంశాలు కొన్నిటిని కొన్ని భాగాలుగా పరిశీలిద్దాం.

యాస్కుడు నిరుక్తములో భాషాభాగాలను నాలుగుగా విభజించాడు. నామాఖ్యాత ఉపసర్గ నిపాతలు అని. నామములు అంటే మన తెలుగులో నామవాచకపదాలు. ఆఖ్యాతలు అంటే క్రియాపదాలు. ఇక మిగిలిన పాణినీయ సూత్రం ఉపసర్గ అంటే క్రియాపదాలకు ముందు వచ్చేది అని. నిపాతలు నామవాచకాలలో చేర్చుకోవచ్చు. అంటే ఉన్నవి రెండే. నామవాచకపదములు, క్రియాపదములు. ఈ శీర్షిక మొదటిభాగములో చెప్పుకున్నట్లు సంస్కృతములోను తెలుగులోను కూడా ప్రయోగించిన ప్రతి పదము కూడా ప్రకృతి ప్రత్యయము అని రెండు అంశముల సమ్మేళనము. ప్రకృతిని ప్రాతిపదిక లేక ధాతువు అని కూడా అంటారు. ఇప్పుడు వీటి విషయము సంక్షిప్తముగా చూద్దాం. 'సుప్ తిఙన్తం పదం' అని వ్యాకరణ సూత్రము. ప్రాతిపదికకు సుప్ అంతముగా ఉంటే సుబంతములని, ధాతువుకు తిఙ్ అంతమునందుంటే తిఙంతములని వ్యవహారము. ఇలా పదముగా మారకపోతే ప్రయోగించటానికి వీలులేదు. ముందుగా నామవాచకాలను పరిచయం చేసుకుందాం.

నామవాచకాలకు చివరన చేర్చే సుప్ ప్రత్యయాలు అంటే తెలుగులో విభక్తి ప్రత్యయాలన్నమాట. సు, ఔ, జస్.... ఇత్యాది 21 ప్రత్యయాలుంటాయి. మరొక ముఖ్య విషయమేమిటంటే సంస్కృతములో వచనాలు మూడు – ఏకవచనము, ద్వివచనము, బహువచనము అని. ఈ 21 ప్రత్యయాలు అంటే మూడు వచనాలలో ఏడు విభక్తులకు ప్రత్యయాలన్నమాట. ఇవి వినడానికి చాలా కఠినమేమో అనిపిస్తాయి కానీ వాటి ప్రయోగము తెలిస్తే ఒక ప్రణాలిక ప్రకారము ఉండి అర్థం చేసుకోవడం చాలా సులభమే. ఈ సుప్ ప్రత్యయాల స్థానములో కొన్ని ఆదేశాలు వచ్చి మనకు వ్యవహారములో వాడే పదరూపాలు సిద్ధిస్తాయన్నమాట.

రామ, కృష్ణ, వృక్ష, నిలయ ఇలా పదాలను గమనిస్తే అన్నిటికీ చివరన 'అ'కారమే ఉన్నది. అలాగే హరి, గిరి, వంటి పదాలకు 'ఇ'కారమే ఉన్నది. ఇలా అన్ని పదాలను అచ్చుల ప్రాతిపదికన విభజించారు. అదే విధముగా కొన్ని పదాలకు హల్లు అంతమందుంటుంది. అలాగే పదాలు మూడు లింగాలలో విభజించవచ్చు – పుంలింగ, స్త్రీలింగ, నపుంసకలింగములని. అంటే మొత్తం నామవాచకపదాలను (6) ఆరు రకాలుగా విభజించారు. మూడు లింగాలకు అచ్చు అంతముగా ఉన్నవి, హల్లు అంతముగా ఉన్నవి అని. అవి ఇలా ఉంటాయి. 1. అచ్ అంతమందున్న పుంలింగ శబ్దాలు, 2. అచ్ అంతమందున్న నపుంసకలింగ శబ్దాలు, 3. అచ్ అంతమందున్న స్త్రీలింగ శబ్దాలు, 4.హల్లు అంతమందున్న పుంలింగ శబ్దాలు, 5.హల్లు అంతమందున్న నపుంసకలింగ శబ్దాలు, 6.హల్లు అంతమందున్న స్త్రీలింగ శబ్దాలు.

అంటే మొత్తం నామవాచక శబ్దాలు 6 విభాగాలలో ఎక్కడైనా చేర్చవచ్చు. కొన్ని శబ్దాలకు సాధారణ రూపముతో పాటు విశేష రూపాలు కూడా ఉంటాయి. వాటిని విశేషశబ్దాలు అంటారు. ముందుగా సామాన్యశబ్దరూపాలు నేర్చుకోవాలి. నామవాచకముల వలెనే సర్వనామశబ్దాలు, అవ్యయాలు కూడా ఉంటాయి.

ఇవి నేర్చుకునేందుకు శబ్దమంజరి అన్న చిన్న పుస్తకము చాలా ఉపయుక్తము. ఒకొక్క అజన్త శబ్దాలను నేర్చుకోవాలి. తరువాత హలన్త శబ్దాలు నేర్చుకోవాలి. అన్నీ నోటికి వచ్చి తీరాల్సిందే. అయితే ప్రతి శబ్దరూపాన్ని గమనిస్తే ఒక చిత్రమైన పద్ధతి గోచరిస్తుంది. కొన్ని విభక్తి రూపాలకు ఒకే శబ్దరూప ముంటుంది. ఉదాహరణకి అకారాంత పుంలింగ రూపాలైన రామ శబ్దములో ద్వివచనములో ప్రథమ, ద్వితీయా రూపాలు, అలాగే తృతీయా, చతుర్థీ, పంచమీ రూపాలు, అలాగే షష్ఠీ, సప్తమీ రూపాలు ఒకలాగే ఉంటాయి. బహువచనములో కూడా చతుర్థీ, పంచమీ రూపాలు ఒకేలా ఉంటాయి. ఇలా జాగ్రత్తగా ఇతర రూపాలను కూడా గమనిస్తే స్త్రీ, పుం, నపుంసక లింగ రూపాలలో కూడా సమానత్వం కనబడుతుంది. ముఖ్యముగా ఈ సమానత్వము ద్వి, బహు వచనరూపాలలోనే గమనిస్తాము. అంటే ముందుగా ఏకవచనరూపాలు సాధిస్తే మిగిలినవి చిన్న ఆలోచనతో సాధించవచ్చునన్నమాట. మన ఇంటిదగ్గర ఏదైనా గుడి ఉందనుకోండి, అక్కడ స్తోత్రాలు, సహస్రనామాలు వినబడుతుంటాయనుకోండి, కొన్నాళ్ళకు మనకు తెలియకుండానే పిల్లలతో సహా అందరికీ నోటికొచ్చేస్తాయి. ఇది వినికిడి వల్ల నేర్చుకున్నట్లు. అలాగే ఈ శబ్దాలను మన సెల్ ఫోన్‌లో మనమే చదివి రికార్డ్ చేసుకుని పదే పదే వింటూ ఉంటే ఇవి కూడా అంతే సులువుగా నోటికొచ్చేస్తాయి. సంస్కృతాధ్యయనములో ఇది మొదటి మెట్టు. ఇది ఎక్కి తీరవలసినదే. ఆ దిశగా ప్రయాణం మొదలు పెడదామా మరి?



యెర్రంశెట్టి ఉమామహేశ్వర రావు గారి అవధానం



చి. వింజమూరి సంకీర్త్యశర్మ అవధానం



చి. నృసింహదేవర జయలక్ష్మి అవధానం

2026 జనవరి 29,30 తేదీలలో అనంతపురంలోని శృంగేరి శంకరమఠం 29వ వార్షికోత్సవాలలో భాగంగా జరిగిన **‘జగద్గురువుల వజ్రోత్సవ భారతి అవధాన సప్తకం’** చిత్రమాలిక




**యువభారతి ‘తెలుగు వెలుగు సమాఖ్య’ కార్యక్రమాలలో సాహితీ జిగీష సంయుక్త ఆధ్వర్యంలో అవుసుల భానుప్రకాశ్ అష్టావధానం**

అవధాన విద్యా విజయతే తరామ్

# అవధాన విద్యా వికాస పరిషత్

భాగ్యనగరం

## ప్రకటన

దైవదత్తమైన ప్రతిభకు వ్యుత్పన్నత తోడైతే, లభించిన పాండిత్యాన్ని నిరంతర అభ్యాసంతో పదునుపెడుతుంటే శిలలాంటి వాడైనా శిల్పంగా మారవచ్చు.

**సాధనాత్ సాధ్యతే సర్వమ్**

అనే లక్ష్యంతోనే అవధాన విద్యా వికాస పరిషత్ ఆవిర్భవించింది.

తెలుగుభాషకే స్వంతమైన అవధానవిద్యను భావితరాలకు పదిలంగా అందించాలనే సదుద్దేశంతో గత నాలుగు సంవత్సరాలుగా మేము చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తుడడం అందరెఱిగిందే. అదే ఒరవడిలో **2026 మే నెల 18వ తేదీనుండి 24 వతేదీ వరకు** ఐదవ శిక్షణ శిబిరాన్ని భాగ్యనగరంలో నిర్వహించ దలచాము.

**వేదిక:** సెయింట్ మార్క్స్ హైస్కూల్, దీనదయాల్ నగర్, నేరేడుమెట్టు, మల్కాజిగిరి, హైదరాబాద్

ఔత్సాహికులు సంసిద్ధులు కండి. మీ సంసిద్ధతను 9441039146 లేదా 9441491900 లేదా 8555082034 నెంబర్‌లకు తెలియజేయండి.

**Published by**
Avadhana Vidya Vikasa Parishat
Sri Rama Sadanam, 29-1499/6/1, Road No.1
West Kakatiya Nagar, Neredmet, Secunderabad - 500056
Ph: 9441039146